


సమీక్షలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు



వేగంగా వరికపూడిశెల పనులు

- జలవనరుల శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

నరసరావుపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల ప్రజలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన వరికపూడిశెల ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్యాంపు కార్యాలయంలో గురువారం జలవనరుల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో వరికపూడిశెలపై సీఎం చంద్రబాబు నాయుడు చర్చించారు. వరికపూడిశెల తొలి విడత పనులు పూర్తి చేసి.. 24,900 ఎకరాలకు సాగు నీరు అందించాలని సూచించారు. రెండో విడత పనులకు సంబంధించి అటవీ, పర్యావరణ అనుమతులు జనవరి కల్లా సాధించాలని ఆదేశించారు. రెండు దశల్లో వరికపూడిశెల పూర్తి చేయడానికి రూ.1,925 కోట్లు వ్యయం అవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 84,281 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని తెలిపారు. సీఎం స్వయంగా వరికపూడిశెలపై సమీక్షించడంతో పనులు వేగవంతం ఆయ్యే అవకాశం ఏర్పడింది. వరికపూడిశెల తొలివిడత పనులకు రూ.340.26 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఈ ప్రాజెక్ట్ పనులు అడుగు ముందుకు సాగలేదు.

ఉమ్మడి గుంటూరు జిల్లాకు.. 2,640 మెట్రిక్ టన్నుల యూరియా 6

నైపుణ్యాల పెంపుతో.. పోటీ ప్రపంచంలో రాణించాలి
- ఏఎన్‌యూ 49 వ్యవస్థాపక దినోత్సవంలో వీసీ ఆచార్య గంగాధరరావు 8

సీఎం చంద్రబాబుకు కు కృతజ్ఞతలు



ఏడుకొండలు, ఆటో డ్రైవర్, నరసరావుపేట

ఆటో మిత్ర పథకం ప్రకటించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు. మహిళ లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తో.. రోజు వారి ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య 20 నుంచి 30 శాతం తగ్గింది. అంతకు ముందు రోజు రూ.700 నుంచి రూ.1000 బాడిగ తోలేవాళ్లం. ఇప్పుడు రూ.500 నుంచి రూ.700కు ఆదాయం తగ్గింది.

ఆటో మిత్ర అదుకుంటుంది..



- చౌడయ్య, డ్రైవర్, రూపెనగుంట్ల

మహిళలకు ఉచిత ప్రయాణం తో కొంతమేర ఆదాయం కోల్పోయాం. దసరా నుంచి ఆటో మిత్ర ద్వారా ఏడాదికి రూ.15 వేలు చెల్లిస్తే.. ఆర్థికంగా మేలు చేసినట్లే. ఆటో డ్రైవర్లకు చేయూత నందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.



ఆటో వాలా ఆనంద హేల

- దసరా నుంచి అమలుకు కసరత్తు

స్త్రీశక్తి పథకం సూపర్ హిట్ అయింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే మహిళల సంఖ్య భారీగా పెరిగింది. ఇదే సమయంలో ఎంతో కొంత ఆటోల నిర్వాహకులు నష్టపోతున్నారు. మహిళల కు ఉచిత ప్రయాణం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆటో డ్రైవర్లకు ఆర్థిక చేయూత అందించేందుకు ఆటో మిత్ర పథకం అమలు చేయబోతోంది. ఆటో వాలకు ఏడాదికి రూ.15 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. దసరా నుంచి పథకం అమలు అవుతుందని సీఎం చంద్రబాబు అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభలో చేసిన ప్రకటనతో ఆటో వాలాలు అనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు అరకొరగా చెల్లించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 28 వేలు ఆటోలు ఉంటాయని రవాణా శాఖ అంచనా. వేలాది మంది ఆటో డ్రైవర్లకు సుమారు రూ.42 కోట్ల లబ్ధి చేకూరనుంది.

'ఆటో మిత్ర'తో ఆటో డ్రైవర్లకు చేయూత

- ఏటా రూ.15,000 ఇస్తామంటూ ప్రభుత్వం వెల్లడి
- 28 వేల మందికిపైగా.. రూ.42 కోట్ల లబ్ధి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆటో మిత్ర పథకం అమలుకు జిల్లాలో రవాణా శాఖ కసరత్తు ప్రారంభించింది. గతంలో ఆటో, మాక్సీ మ్యాజిక్ క్యాబ్‌లకు వాహన మిత్ర పథకం అమలు చేశారు. ఈ సారి అచ్చంగా ఆటోలు నడిపే వారికేనా లేక క్యాబ్‌లకు కూడా ఈ పథకం అమలు చేస్తారా అనే అంశం ప్రభుత్వ మార్గదర్శకాల్లో తేలనుంది. కొన్ని పట్టణాల్లో ఆర్టీసీ సిటీ సర్వీసులు లేవు. దీని వల్ల పట్టణాల్లో ఆటో వాలలకు నష్టం నామ మాత్రమే. అయితే గ్రామాల నుంచి మహిళలు ఆటోల్లోనే ప్రయాణించే వారు. ఉచిత ప్రయాణంతో వీరందరూ ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో గ్రామీణ ఆటో డ్రైవర్లు నష్టపోతున్నట్లు చెబుతున్నారు.

ఆటో డ్రైవర్లకే ఆర్థిక సాయం ఇవ్వండి..

హరిత పన్ను తగ్గింపుతో.. ప్రభుత్వం ఆటో వాలలకు ఆర్థిక భారం తగ్గించిన విషయం తెలిసిందే. మేలో హరిత పన్ను విధానం అమలు చేసిన ప్రభుత్వం.. దసరాకు ఆటో మిత్ర పథకం అమలు చేస్తూ ఆటో వాలాలకు డబుల్ ధమాకా అందిస్తోంది. అయితే రోజూ ఆటో నడిపే



డ్రైవర్లకు పథకం వర్తింపజేయాలని డ్రైవర్లు కోరుతున్నారు. రోజు వారీ అద్దెకు ఆటోలు నడుపుతుంటామని అయితే ఆటో ఓనర్లకు కాకుండా డ్రైవర్లకు ఆటో మిత్ర అమలు చేయాలంటున్నారు. ఆటో మిత్ర పథకం ప్రకటనపై కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.



తమీమ్ అన్సారియా
కలెక్టర్, గుంటూరు జిల్లా



కృతికా శుక్లా
కలెక్టర్, పల్నాడు జిల్లా



డాక్టర్ వి. వినోద్‌కుమార్
కలెక్టర్, బాపట్ల జిల్లా

మూడు జిల్లాలకు నూతన.. కలెక్టర్లు

- నాగలక్ష్మి స్థానంలో తమీమ్ అన్సారియా
- వెంకటమురళిని మార్చి వినోద్‌కుమార్‌కు పోస్టింగ్
- అరుణ్‌బాబును బదిలీ చేసి కృతికా శుక్లా నియామకం
- మానవీయ కోణంలో పనిచేయాలని సీఎం దిశానిర్దేశం
- ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఆశలు నెరవేర్చాలన్న చంద్రబాబు

గుంటూరు, బాపట్ల,పల్నాడు కలెక్టర్ల బదిలీ

నరసరావుపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఒకే సారి బదిలీ అయ్యారు. సుదీర్ఘ కసరత్తు అనంతరం గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చీఫ్ సెక్రటరి విజయానంద్ కలెక్టర్ల బదిలీలకి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రకారం గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్థానంలో తమీమ్ అన్సారియా నియమితులయ్యారు. బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళిని మార్చి డాక్టర్ వినోద్‌కుమార్‌కు పోస్టింగ్ ఇచ్చారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును బదిలీ చేసి కృతికశుక్లా నియమించారు. నాగలక్ష్మి, వెంకటమురళి, అరుణ్‌బాబులకు ప్రభుత్వం పోస్టింగ్ చేయలేదు. నూతన కలెక్టర్లు త్వరలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు కలెక్టరేట్ వర్గాల సమాచారం. కాగా నూతన కలెక్టర్ల పోస్టింగ్ అనంతరం సీఎం చంద్రబాబు తన క్యాంపు కార్యాలయంలో గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో (మిగతా 8వ పేజీలో)

- మూడు జిల్లాల్లో 112 బార్లకు 15 దరఖాస్తులు
- 14 వరకే అవకాశం.. శని, ఆదివారాలు బ్యాంకులకు సెలవు
- అధికారులు వేడుకుంటున్నా ముందుకురాని మద్యం వ్యాపారులు
- ఎక్సైజ్ అధికారుల గుండెల్లో రైళ్లు.. అన్ని మార్గాల్లో ప్రయత్నాలు



బార్ల దరఖాస్తులకు స్పందన అంతంతే

గడువు.. మూడు రోజులే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం బార్ల నిర్వహణకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. తొలివిడతలో రెండు సార్లు అవకాశం ఇవ్వగా దరఖాస్తులు స్పందన కానరాలేదు. దీంతో రెండో విడతలో ఈ నెల 3న గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 112 బార్లకు రీ నోటిఫికేషన్ ఇచ్చింది. వీటికి ఆదివారం వరకు గడువు ఇచ్చింది. రీనోటిఫికేషన్ గడువు ఇక మూడు రోజులు మాత్రమే ఉంది. ఇందులో శనివారం, ఆదివారం బ్యాంకులకు సెలవు. అయితే ఇంతవరకు దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. బాపట్ల జిల్లాలో 15 బార్లకు రీ నోటిఫికేషన్ ఇవ్వగా గురువారానికి కేవలం ఐదు దరఖాస్తులే వచ్చినట్లు సమాచారం. కేవలం మూడు రోజులు మాత్రమే మలివిడత నోటిఫికేషన్‌లో గడువు మిగిలి ఉన్నా వ్యాపారులు దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపకపోవడంపై అధికారులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలో 67 బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా ఎనిమిది, పల్నాడు (మిగతా 8వ పేజీలో)

అధికారం.. ఆక్రమణ

- వేల ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జా
- 150 మందిని గుర్తించి నోటీసుల జారీ
- అవినీతి అధికారులపైనా చర్యలకు రంగం సిద్ధం

గురజాల టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారం అండ.. అధికారుల అవినీతి వెరసి వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి. కొందరు అధికారులను మచ్చిక చేసుకుని సర్వే నెంబర్లను మార్చి ఆయా ప్రభుత్వ భూములను తమ పేరిటకు పలువురు నేతలు మార్చేసుకున్నారు. సదరు భూములను కొందరు బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణం పొందగా, మరికొందరు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఆయా అక్రమాలపై ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాలతో అధికారులు విచారణ చేపట్టగా విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. ఆర్డీవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన అధికారులు కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల వివరాలను గత నెల రోజులుగా వెలికితీసే పనిలో పడ్డారు. ఇందుకోసం సర్వే చేపట్టారు. అసలు ఇదేలా సాధ్యమంటూ అధికారులే తలలు పట్టుకుంటున్నారు. గురజాల నియోజకవర్గంలోనే సుమారు 2 వేల పైచీలుకు ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్లు అధికారుల సర్వేలో తేలినట్లు సమాచారం. గురజాల మండల పరిధిలో సర్వే ముమ్మరం కాగా సుమారు 150 మంది ఆక్రమణదారులను గుర్తించారు. వీరిలో ఇప్పటికే 50 మంది వరకు నోటీసులు కూడా జారీ చేసినట్లు సమాచారం. సదరు వ్యక్తులు భూములకు సంబంధించి తమ వద్ద ఉన్న పత్రాలను తీసుకుని రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి రావాలని నోటీసులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వారి పత్రాలు సరైనవో కావో పరిశీలించి అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. నోటీసుల జారీతో వైసీపీ నేతల్లో కలవరం మొదలైంది. అధికారం అండ చూసుకొని ఆక్రమణలకు పాల్పడిన వైసీపీ నేతలు ఇప్పుడు లబోదిబో అంటూ తమకు గతంలో అండగా నిలిచిన నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆక్రమిత భూముల ద్వారా రుణాలు పొందినట్లు తేలితే సదరు వ్యక్తుల సమాచారాన్ని బ్యాంకులకు కూడా చేరవేయనున్నట్లు తెలుస్తోంది. అంతేగాకుండా వైసీపీ హయాంలో అవినీతికి పాల్పడిన అధికారులపై కూడా చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- డీఎల్‌డీవో కార్యాలయ పరిశీలనలో కృష్ణతేజ

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి డీఎల్‌డీవో కార్యాలయాన్ని త్వరలో ప్రారంభించాలని పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ తెలిపారు. పట్టణంలోని డీఎల్‌డీవో కార్యాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.10 లక్షలు అవసరమవుతాయని డీఎల్‌డీవో రాజగోపాల్ కమిషనర్‌కు తెలిపారు. దీంతో అక్కడి నుంచే నిధులను మంజూరు చేయాలని జడ్పీ సీఈవోకు ఫోన్‌లో కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో నాగేశ్వరరావునాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈ సింగ్, కార్యదర్శులు ఉన్నారు.



డీఎల్‌డీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ



సబ్ జైలు ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

సబ్‌జైలులో కలెక్టర్, ఎస్పీ తనిఖీ

- సదుపాయాలు పరిశీలించి పలు సూచనలు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 11, (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో తీసుకుంటున్న భద్రతా చర్యలతో పాటు ఖైదీల సంక్షేమానికి సంబంధించిన సదుపాయాలను వారు పరిశీలించారు. సబ్‌జైలులోని ఖైదీలతో కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడారు. వసతులు, మెనూ ప్రకారం అందిస్తున్న భోజనం తదితరాలపై ఖైదీలను ప్రశ్నించారు. ఖైదీల హక్కులకు భంగం వాటిల్లకుండా మసులుకోవాలని జైలు అధికారులకు సూచించారు. ఖైదీలు సత్ప్రవర్తన వైపు నడిచేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జైలు జీవితం అనంతరం ఉపాధి పొందేలా ఖైదీలకు నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. వారి వెంట ఆర్డీవో మధులత, తహసీల్దారు, సబ్ జైలర్ తదితరులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియానికి తాళం

- రూ.3 కోట్ల స్టేడియం నిరుపయోగం
- క్రీడాకారులకు ఉపయోగంలోకి రాని వైనం

మాచర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రోత్సహించేలా మాచర్ల పట్టణంలో ఐదేళ్ల క్రితం రూ.3 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మించారు. అయితే ఇది క్రీడాకారులకు ఉపయో గంలోకి రాలేదు. ఇండోర్ స్టేడియానికి తాళం వేసి ఉంచారు. పట్టణ సమీపంలోని టిడ్కో గృహాల సమీపంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన స్టేడియం ప్రాంగణం పిచ్చి మొక్కలు, కంపచెట్లతో నిండిపోయింది. జిమ్, షటిల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడలకు ఉపయుక్తంగా ఉండేందుకు పక్కా భవనాలు నిర్మించారు. చుట్టూ ప్రహరీ, మెయిన్ గేటు, షాపింగ్ కాంప్లెక్ నిర్మించారు. అయితే దీనిని వినియోగంలోకి తీసుకురాకుండా తాళం వేశారు. కళ్లెదుట స్టేడియం ఉన్నా అది వినియోగంలోకి రాకపో వడంతో క్రీడాకారులు, విద్యా ర్థులు క్రీడలకు ఇబ్బంది పడుతు న్నారు. అధికారులు, పాలకులు కూడా స్టేడియాన్ని ప్రారంభిం చాలన్న ఆలోచన చేయడంలేదు. దీంతో ఎస్‌కేబీఆర్ కళాశాల గ్రౌండ్‌లో కొద్దిపాటి స్థలంలోనే యువత క్రీడలు నిర్వహించుకుంటున్నారు.



షాపింగ్ కాంప్లెక్స్



- నిరుపయోగంగా మినీ స్టేడియం

నిధుల కేటాయింపుల్లో జడ్పీటీసీలకే మొదటి ప్రాధాన్యం

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా


ఒకటవ స్థాయి సంఘ సమావేశంలో జడ్పీ చైర్‌పరన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈఓ జ్యోతి బసు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ నిధుల కేటాయింపులో జడ్పీటీసీ సభ్యులకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా స్పష్టం చేశారు. జడ్పీటీసీలు అడిగిన పనులకు నిధులు కేటాయించిన తర్వాతే మిగిలిన వారికి ఇస్తున్నామని పేర్కొన్నారు. గురువారం జడ్పీ కార్యాలయంలో 1, 2, 3, 4, 5, 6, 7 స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించారు. 3వ స్థాయి సంఘం మినహా, మిగిలిన అన్ని సంఘాలకు కోరం సరిపోయింది. ఒకటవ స్థాయి సంఘం సమావేశంలో నిధుల కేటాయింపు వ్యవహారంపై చర్చ జరిగింది. నరసరావుపేట జడ్పీటీసీ చిట్టిబాబు మాట్లాడుతూ.. ఏడాది క్రితం ప్రతి పాదించిన పనులను ఇంత వరకు అజెండాలో చేర్చలేదని అసహనం వ్యక్తం చేశారు. నరసరావుపేటకు గతంలోనే రూ. 4 కోట్లు కేటాయించిన విషయాన్ని జడ్పీ చైర్‌పర్సన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. జడ్పీటీసీ సభ్యుల ప్రతిపాదనలను తన కార్యాలయం నుంచి అధికారులకు ఎప్పుడో పంపానని వెల్లడించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో జడ్పీటీసీలు ప్రతిపాదించిన పనులకు ప్రాధాన్యం ఇస్తామని చైర్‌పర్సన్, సీఈఓ హామీ ఇచ్చారు. నాదెండ్ల జడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో నిర్వహించిన వేలం పాటను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని కోరారు... అందుకు నిబంధనలు ఒప్పుకోవని సీఈఓ స్పష్టం చేశారు. ఆయా శాఖల జిల్లా అధికారులు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు.

రీ-సర్వే పరిశీలనలో 70 మంది సివిల్ జడ్జిల బృందం


రీసర్వే తీరును జడ్జిలకు వివరిస్తున్న సర్వేయర్లు

దుగ్గిరాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ల ద్వారా తీసిన చిత్రాలను సరిచేసి.. భూమి వాస్తవ రూపానికి అనుగుణంగా మార్చిన చిత్రాలు (ఓఆర్ఐ) సర్వేలో ఉపయోగ పడతాయని తెనాలి డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ పార్థసారథి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు చెందిన 70 మంది సివిల్ జడ్జిల బృందం భూ-సర్వే జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు మండలంలోని తుమ్మపూడి గ్రామానికి గురువారం చేరుకుంది. తెనాలి - విజయవాడ మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ఓ పొలంలో సర్వే సిబ్బంది తమ వద్దనున్న సర్వే ఉపకరణాల ద్వారా భూ-రీసర్వే గురించి వివరించారు. వీఆర్ఓ, విలేజ్ సర్వేయర్, వీఏఓల బృందం సర్వే చేసిన అనంతరం గ్రౌండ్ ట్రూతింగ్, గ్రామ సరిహద్దుల నిర్ణయం, ప్రభుత్వ భూములకు సంబంధించి పాయింట్లను గుర్తించి సర్వే రాళ్లను ఏర్పాటు చేయడం, ప్రస్తుతం భూమి మీదున్న రైతులు, వారి భూమి విలువ, అడంగల్‌లో నమోదు చేయడాన్ని వివరించారు. సర్వే పూర్తయ్యాక యజమానికి 9-2 నోటీసులు అందించి, తప్పులు ఉంటే వాటిని సరిచేయడం, ఎల్‌పీఎం జారీ విధానం గురించి తెలియజేశారు. ఒక ఎకరం పొలం కలిగి ఉంటే.. ఇద్దరికీ సమానంగా ఏ విధంగా విభజించాలో, క్రయవిక్రయాల సమయంలో ఆన్‌లైన్ సబ్ డివిజన్ చేయాలో తదితర అంశాలను సివిల్ న్యాయమూర్తుల బృందానికి వివరించారు. దుగ్గిరాల, తాడేపల్లి, పెదకాకాని మండల సర్వేయర్లు గోపాలరావు, రవితేజ, వీరాంజనేయులు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల..

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు


గుంటూరు సర్కిల్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఎండీ పుల్లారెడ్డి, డైరక్టర్ మురళీకృష్ణయాదవ్ తదితరులు

గుంటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని అడవి తక్కెళ్ళపాడు సబ్‌స్టేషన్ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన విద్యుత్‌శాఖ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. రాష్ట్రంలోని మూడు డిస్కంలతో పాటు ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో లోని టీంలు టెన్నిస్, బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జేకేసీ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడంతో మానసిక ఉల్లాసంతో పాటు.. శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. టెన్నిస్‌లో గుంటూరు ఆపరేషన్ సర్కిల్‌కు మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి నెల్లూరు ఆపరేషన్ సర్కిల్, తృతీయ బహుమతి విద్యుత్ సౌధ (విజయవాడ) ఉద్యోగుల జట్లు నిలిచినట్లు తెలిపారు. బాస్కెట్ బాల్ పోటీల్లో రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజక్ట్ మొదటి బహుమతి, రెండో బహుమతి ఎన్‌టీపీసీ (విజయవాడ), మూడో బహుమతి గుంటూరు ఆపరేషన్ సర్కిల్ సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విజేతలైన ఉద్యోగులకు సీఎండీ పుల్లారెడ్డి చేతుల మీదుగా బహుతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్ (టెక్నికల్), ఎస్ వెంకటేశ్వర్లు (ఫైనాన్స్), గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, ఎస్ఏవో పాశం రామిరెడ్డి, గుంటూరు-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు పలువురు అధికారులున్నారు.

కొరియన్ భాషతో భవిష్యత్తు అవకాశాల విస్తరణ

● కౌన్సిల్ జనరల్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ కొరియా చాంగ్ న్యూన్ కిమ్



మాట్లాడుతున్న కిమ్, విద్యార్థినుల నృత్యాలు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొరియన్ భాషా అభ్యాసం కొనసాగిస్తూ.. ఉన్నత స్థాయి ప్రావీణ్యం సాధించడం ద్వారా భారత విద్యార్థులు, యువతకు కొరియా, కొరియన్ కంపెనీలతో భవిష్యత్తు అవకాశాలను విస్తరించవచ్చని చెన్నైలోని కౌన్సిల్ జనరల్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ కొరియా చాంగ్ న్యూన్ కిమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ స్టూడెంట్ అఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం "కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్"ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చాంగ్ న్యూన్ కిమ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న పోటీ పరిస్థితుల్లో ఆసియా ఖండంలో భారత్, కొరియా కీలక భాగస్వాములని పేర్కొన్నారు. కొరియా సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని, భారతదేశ ప్రజలు విపరీతంగా ఆదరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్‌లో 311.44 టీఎంసీలు

విజయపురిసౌత్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం గురువారం నాటికి 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,700, ఎడమ కాలువ ద్వారా 6,949 , ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,698, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 53,047 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 80,714 క్యూసెక్కులుగా ఉంది.

పులిచింతలలో 43.79 టీఎంసీలు..

అచ్చంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 43.79 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 32,726 క్యూసెక్కుల నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద 16,600 క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా, 400 క్యూసెక్కులు లీకుల ద్వారా, ఒక గేటు ద్వారా 24,063, మొత్తం 41,063 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాకు..

2,640 మెట్రిక్ టన్నుల యూరియా


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న జేసీ, డీఏఓ

గుంటూరు సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు మరో 2,640 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. గుంటూరు సమీపంలోని రెడ్డిపాలెం రైల్వే స్టేషన్‌కు చేరిన యూరియా నిల్వలను జేసీ అశుతోష్ శ్రీవాస్తవ గురువారం పరిశీలించారు. యూరియాను సొసైటీలు, మార్క్‌ఫెడ్, ప్రైవేట్ డీలర్లకు దామాషా పద్ధతిలో కేటాయిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు.

మంత్రి నారా లోకేశ్ కృషితో..

స్వస్థలాలకు తెలుగువారు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారు మంత్రి నారా లోకేశ్ కృషితో స్వస్థలాలకు తీసుకురావడం జరుగుతుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం పేర్కొన్నారు. తెలుగు వాళ్లు ఎక్కడ ఏ ఆపదలో ఉన్నా స్పందించి సురక్షితంగా స్వస్థలాలకు చేరుస్తున్నటువంటి యంగ్ డైనమిక్ లీడర్ నారా లోకేశ్ అని కొనియాడారు. అన్నారు. నేపాల్‌లో జరుగుతున్న మారణ హోమంలో తెలుగు ప్రజలు చిక్కు కున్నారనే విషయం తెలిసిన వెంటనే.. క్షణం కూడా ఆలస్యం చేయకుండా అనంతపురం పర్యటన రద్దు చేసుకున్నారని గుర్తుచేశారు. సచివాలయం రియల్ టైమ్ గవర్నెన్స్ రూమ్‌ని కమాండ్ కంట్రోల్ రూమ్‌గా మార్చి వేగవంతంగా చర్యలు చేపట్టారన్నారు. బాధితులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ.. లోకేషన్ కోఆర్డినేటర్లతో రూట్ మ్యాప్ సిద్ధం చేయించి, ఢిల్లీలోని ఏపీ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో ఒక నాయకుడు ఆంధ్ర ప్రజలు నేపాల్‌లో చిక్కుకున్న ఘటనపై నోరు మెదపక పోవడమే కాకుండా.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వ్యాఖ్యలు చేస్తూ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక


బాల బాలికల సెపక్ తక్రా జిల్లా జట్లు

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-14, 17 బాల బాలికల జిల్లా సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపికలు మండలంలోని నందిగామ జడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి బాల బాలికల విభాగంలో 150 మంది క్రీడాకారులు హాజరైనట్టు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేశ్ కుమార్ తెలిపారు. జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా లాకు పిచ్చయ్య, బి. అనీల్ దత్త నాయక్, కోనంకి కిరణ్ కుమార్ వ్యవహరించారు. పీడీలు దాసరి కోటేశ్వర రావు, పాఠశాల హెచ్‌ఎం కాకరపర్తి శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గందు సాంబశివరావు, తులసీ రామ్ నాయక్, రత్నాకర్, మెహబూబీ, కె. స్వాతి, సీహెచ్ అనూష పాల్గొన్నారు.

అక్కడ టీడీపీ ఉంటుంది: యరపతినేని

తెలుగు వారికి ఎక్కడ ఆపద ఉంటే..

● నేపాల్ ఘటనలో లోకేశ్ స్పందన భేష్



పిడుగురాళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారికి ఎక్కడైనా ఆపద అనే పదం వినిపిస్తే అక్కడ టీడీపీ అండగా ఉంటుందనేందుకు నేపాల్ ఘటనతో లోకేశ్ మరోసారి రుజువు చేశారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం పేర్కొన్నారు. నేపాల్‌లో జరుగుతున్న మారణ హోమంలో చిక్కుకున్న తెలుగు వారిని రక్షించేందుకు అనంతపురం పర్యటన కూడా రద్దు చేసుకొని సచివాలయానికే పరిమితమయ్యారన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ నుంచి కమాండ్ కంట్రోల్ ద్వారా సహాయక చర్యలు వేగవంతం చేశారని పేర్కొన్నారు. ప్రత్యేక విమానం ద్వారా 215 మందిని స్వస్థలాలకు తీసుకురావడంలో లోకేశ్ కీలకపాత్ర వహించారన్నారు.

మెడికల్ కాలేజీల.. కాంట్రాక్టర్లను బెదిరించడం దుర్మార్గం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందడం జగన్‌కు ఇష్టంలేదని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. అందుకే ప్రభుత్వం త్వరగా పూర్తిచేయాలనుకుంటున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను అడ్డుకుంటామని, కాంట్రాక్టులు పొందినవారి టెండర్లు రద్దుచేస్తామని జగన్ బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. గురువారం తన నివాసంలో నాదెండ్ల, యడ్లపాడు మండలాల పరిధిలోని పలువురికు రూ.25 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాల ఆరోగ్యరక్షణ కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో సంజీవని పథకాన్ని తీసుకురాబోతున్నారని చెప్పారు. మెడికల్ కాలేజీల నిర్మాణంలో ప్రభుత్వం అనుసరిస్తున్న పీపీపీ విధానం తనకు ఎందుకు నచ్చలేదో జగన్ సమాధానం చెప్పాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. పీపీపీ విధానమంటే గతంలో తాను అవలంబించిన డీబీటీ విధానంలా అవినీతికి ఆస్కారం ఉండేది కాదనే నిజాన్ని జగన్ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల టీడీపీ అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ చొరవ అభినందనీయం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం చొరవ మానవీయ విలువలకు ప్రతిబింబంగా నిలిచిందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నేపాల్‌లోని తెలుగు వారిని రక్షించి, స్వదేశానికి తిరిగి తీసుకువచ్చే చర్యలు వేగంగా, సమర్థంగా జరుగుతున్నాయని తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఏ రాష్ట్ర ప్రభుత్వం నేపాల్‌లో చిక్కుకున్న వారిని తీసుకురావడానికి ఇలాంటి ప్రయత్నం చేయలేదని, కూటమి ప్రభుత్వమే ఈ విధంగా ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రజల పట్ల బాధ్యత, సంక్షేమ దృక్పథానికి ఇది నిదర్శనంగా పేర్కొన్నారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి లోకేష్ అనంతపురం పర్యటన రద్దు చేసుకుని మరీ అమరావతిలోని ఆర్టీజీఎస్ ఆఫీస్‌కు చేరుకుని ఎప్పటికప్పుడు సమీక్షించడం, ప్రభుత్వం ఢిల్లీలో ప్రత్యేక విమానం ఏర్పాటు చేయడం ద్వారానే తక్షణ ఉపశమనం అందించగలిగామన్నారు.

నేపాల్‌లో తెలుగు ప్రజలకు రక్షగా నారా లోకేశ్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



పొన్నూరుటౌన్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): సంక్షోభ నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగు వారికి అండగా నిలిచి.. వారిని సురక్షితంగా..ఏపీకి రప్పించడంలో యువనేత మంత్రి నారా లోకేశ్ కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ గురువారం కొనియాడారు. తెలుగు ప్రజల పట్ల టీడీపీ చిత్తశుద్ధిని.. ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను మంత్రి లోకేశ్ చాటి చెప్పారన్నారు. తెలుగు వారిని.. అనుక్షణం కాపాడుకునేలా ఒక్క సమాచారంతో స్పందించి.. అనుక్షణం చర్యలు చేపట్టిన యువనేతకు దేశ వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. తెలుగు వారికి విపత్తులు, ఆపద పదం వినపడితే మొదటి స్పందించింది తెలుగుదేశం పార్టీ, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు అన్నారు. తాత తండ్రులను అనుసరించడమే కాకుండా నారా లోకేశ్ నేడు చేసిన కృషి వారందరికీ తగ్గ భవిష్యత్తు నాయకుడిగా చాటారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో అత్యవసర హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం ప్రజలకు ఆహారం మీరు వసతి సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టడం కేంద్ర సహకారంతో సమన్వయంతో ఆపదలో ఉన్న ఒక్కొక్కరిని సురక్షితంగా రక్షించడానికి లోకేశ్ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లారన్నారు. నేపాల్ లో జరుగుతున్న అల్లర్లలో చిక్కుకున్న సుమారు 215 తెలుగు ప్రజలను సురక్షితంగా మాతృభూమికి తీసుకురావడంలో లోకేష్ పాత్ర కీలకమన్నారు.

గడువు.. మూడు రోజులే

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 30 బార్లకు రెం డు దరఖాస్తులు వచ్చాయి. అంటే ఇప్ప టి వరకు మూడు జిల్లాల పరిధిలో బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన రీ నోటిఫికేషన్‌కు స్పందన తీసికట్టుగా నే ఉన్నట్లు అర్థమవుతోంది. బాపట్ల జిల్లాలో 19 బార్లలో తొలి విడతలో నాలుగు బార్లకు లాటరీ నిర్వహించారు. మిగిలిన 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేయగా నిబంధనల ప్రకారం 60 దరఖాస్తులు రావాల్సి ఉండగా ఐదు మాత్రమే రావడంపై ఎక్సైజ్ అధికారులు విస్తుపోతున్నారు. గుంటూరు జిల్లాలో 110 బార్లకు 43 బార్లకు లాటరీ నిర్వహించగా మిగిలిన 67 బార్లకు రీ నోటిఫికేషన్ ఇచ్చారు. కాగా ఇప్పటి వరకు మంగళగిరి, పొన్నూరులో ఒక్కొక్క బార్‌కు నాలుగేసి చొప్పున మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. పల్నాడు జిల్లాలో 49 బార్లకు తొలివిడతలో 19 బార్లను లాటరీ ద్వారా కేటాయించారు. మిగిలిన 30 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించగా పిడుగురాళ్లలో రెండు బార్లకు ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చాయి. కాగా రీ నోటిఫికేషన్ గడువు ప్రకారం శుక్రవారం వచ్చే దరఖాస్తులపైనే ఎక్సైజ్ అధికారులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఆశావహులతో సమావేశమైన అధికారులు దరఖాస్తు చేయాల్సిందిగా కోరారు. ఓ వైపు వ్యాపారుల నుంచి స్పందన లేకపోవడం, మరోవైపు ముంచుకొస్తున్న గడువు, ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో నేపథ్యంలో ఏమిచేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం సగం బార్లకు అయినా దరఖాస్తులు రావాలని, లేనిపక్షంలో వైఫల్యంగా భావించి చర్యలు తప్పవనే సంకేతాలను ఇప్పటికే అధికారులకు పంపారు. దీంతో ముందునుయ్యి వెనక గొయ్యిలాగా ఎక్సైజ్ అధికారుల పరిస్థితి మారింది. చివరి ప్రయత్నంగా గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారితో పాటు, బార్ల వ్యాపారంలో అనుభవం ఉన్న వారితో శుక్రవారం మరోమారు సంప్రదింపులు జరపడానికి ఎక్సైజ్ విభాగం సిద్ధమవుతోంది. బార్ల వ్యాపారం లాభసాటిగా ఉంటుందని దరఖాస్తులు చేయాలని అటు అసోసియేషన్ నాయకులతో పాటు ఈ రంగంలో అనుభవజ్ఞులను అధికారులు కోరుతున్నారు.

'వీఐటీ'లో నేషనల్ సెమీ కండక్టర్ టెక్నాలజీ సింపోజియం


పాల్గొన్న ప్రముఖులు, యాజమాన్య సభ్యులు

తుళ్లూరు, (ఐనవోలు) సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ సెమీ కండక్టర్ టెక్నాలజీ సింపోజియం (ఎన్ఎస్‌టీఎస్) 2025 ప్రారంభోత్సవం రాజధాని అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో ఘనంగా గురువారం ప్రారంభమైంది. ఈ సింపోజియం ఈ నెల 13 తేదీ వరకు జరగనుంది. ఈ మూడు రోజుల సింపోజియంను వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం, ఎట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, స్టూడెంట్ బ్రాంచ్, మైక్రోవేవ్ థియరీ అండ్ టెక్నిక్స్ సొసైటీ మద్దతు ఇస్తున్నాయి. స్వదేశీ ఆవిష్కరణ, నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమ-విద్యా సహకారంపై దృష్టి సారించడం ద్వారా భారతదేశం సెమీ కండక్టర్ ప్రస్థానాన్ని ముందుకు తీసుకువెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వీఐటీ పేర్కొంది. ఈ సింపోజియంలో 400 మందికి పైగా ప్రతినిధులు, ప్రపంచ, జాతీయ కంపెనీల నుంచి 20 మందికి పైగా పరిశ్రమ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపింది. ఈ కార్యక్రమంలో 12 మంది నిపుణుల చర్చలు, ఓపెన్ చిప్ డిజైన్, ఎడ్జ్ కంప్యూటింగ్ నుంచి మొబిలిటీ, హెల్త్‌కేర్ స్వదేశీ ఆవిష్కరణల వరకు అంశాలను కవర్ చేసే రెండు ప్యానెల్ చర్చలు ఉన్నాయి. ప్రారంభ రోజున వర్సిటీ ఇన్వెంటిజ్, సాయంట్ ఇండియా అనే నాలుగు మార్గదర్శక కంపెనీలతో వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు మీద సంతకాలు జరిగాయి. ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, సీఐఐ ఆంధ్ర ప్రదేశ్ వైస్ చైర్మన్, అపెక్స్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేంద్ర కె.శరణం, వీఐటీ వర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్.వి. కోటారెడ్డి మాట్లాడారు. ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, శరవణన్ జయరామన్, ప్రొఫెసర్ డాక్టర్ అమీత్ చవాన్, డాక్టర్ ఉమాకాంత్ నందా తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 145, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు

రాజుపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడులో ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులు మరింత అవగాహన పెంచుకొని సాగు చేయాలని పల్నాడు ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) కె.అమలకుమారి తెలిపారు. గురువారం రెడ్డిగూడెంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో నాగేశ్వరరావు, జ్యోతి కుటుంబం సాగు చేస్తున్న పంటలను, కూరగాయలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు భూములను తక్కువ కౌలుకు ఇస్తూ ప్రోత్సహిస్తున్న రైతు గల్లా ప్రసాద్‌ను డీపీఎం అమలకుమారి అభినందించారు.

మొక్కల పెంపకంతో బహుళ ప్రయోజనాలు

క్రోసూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ఎంఈవోలు జీ కృష్ణ, ఎం గణేష్ అన్నారు. గురువారం అందుకూరు జడ్పీహైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులను మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు స్వీకరించిన డీ ధర్మారావు, గంగాధర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యోగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సురక్షిత లైంగిక ప్రవర్తనలపై అధికారుల సూచనలు పాటించాలి

మాచవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కండోమ్ ప్రమోషన్, సురక్షిత లైంగిక ప్రవర్తనలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోయ రజని సూచించారు. గురువారం మండలంలోని కొత్త పాలెంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ శాఖ జిల్లా వైద్యఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డ్వాక్రా ఏపీఎం బాలస్వామి, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటి లక్షా 18 వేల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

రెంటచింతల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు విడుదలయ్యాయి. బేసిక్, టైడ్ నిధులు కోటీ లక్షా 18వేల 916 విడుదలైనట్లు మండల పరిషత్ అధికారులు గురువారం తెలిపారు. ఈ నిధులను పారిశుధ్యం, మంచినీరు, వీధి దీపాలు, సిబ్బంది జీతభత్యాలకు వినియోగించాల్సి ఉంది.

సత్యసాయి మందిరంలో అన్నదానం

దుర్గి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని శ్రీసత్యసాయి మందిరంలో గురువారం జాతీయ నారాయణ సేవాసమితి ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు. దుర్గి గ్రామానికి చెందిన అరిగెల నాగమణి, యెనుముల వెంకటేశ్వర్లు, ఓబులేశునిపల్లెకు చెందిన మాగులూరి శ్రీనులు ఈ సేవా కార్యక్రమానికి సహకారం అందించారు.

పాలువాయి జంక్షన్‌లో...

రెంటచింతల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాలువాయిజంక్షన్‌లోని షిర్డిసాయి ఆలయంలో గురువారం వెన్నా వెంకటేశ్వర రెడ్డి, వెంకటలక్ష్మి దంపతులు వందలాది మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీసీ మాజీ చైర్మన్ నల్లబిరుదు నరసింహారావు, భాస్కరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

దసరా నవరాత్రులపై సమీక్ష

రెంటచింతల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి నిర్వహించే దసరా నవరాత్రులపై అధికారులు, పాలక మండలి సభ్యులతో చైర్మన్ గుండా వెంకట శివయ్య గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి ,సభ్యులు బ్రహ్మాచారి, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకునేది టీచర్లే

రెంటచింతల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకుని నడవడికను నేర్పేది టీచర్లేనని ఎంఈవో-2 శివనాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని మంచికల్లు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళ్తున్న వీర వసంతకుమారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లారెడ్డి, హెచ్‌ఎం సిలార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలగుడి రామాలయంలో హోమాలు

పెదకూరపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని బొమ్మలగుడి రామాలయంలో దేవాలయాన్ని నిర్మించి వంద సంవత్స రాలు పూర్తయిన సందర్భంగా హోమాలను నిర్వహిస్తున్నారు. గురువా రం ఉదయం 9 గంటల నుంచి హోమాలను చలమచర్ల సూర్యనారా యణాచార్యులు, రామానుజాచార్యులు పర్యవేక్షణలో పూజలను నిర్వ హిస్తున్నారు. ఈ సందర్భంగా పట్టాభి రామచంద్రస్వామిని అలంకరిం చారు.

వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా శివప్రసాదు

సత్తెనపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం కార్యదర్శిగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన అచ్యుత శివ ప్రసాదును నియమిస్తూ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉత్తర్వుల కాపీని అచ్యుత శివప్రసాదు విలే కరులకు అందించారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడి మృతి

నకరికల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కుంకలగుంట గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు షేక్ నూర్ అహ్మద్ బుధవారం మృతిచెందాడు. గురువారం కుంకలగుంటలో భౌతికకాయానికి పలువురు ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

సాగర్ కుడి కాలువలో వ్యక్తి గల్లంతు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ కుడి కాలువలో పడి వ్యక్తి గల్లంతు అయిన సంఘటన మాచర్ల మండలం తాళ్లపల్లి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రెంటాలకు చెందిన పల్లె అంజిరెడ్డి(35)సాగర్ లోని వైన్స్ షాపులో పనిచేస్తున్నాడు.అప్పుల బాధతో అంజిరెడ్డి మనస్తాపానికి గురై తాళ్లపల్లి కాలువ వద్ద వెళ్లి తన సోదరికి చనిపోతున్నా అంటూ వీడియో కాల్ చేసి కాలువలో దూకాడు.అనంతరం కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలించగా అంజిరెడ్డి ఆచూకీ కనపడలేదు.దీనితో అంజిరెడ్డి భార్య స్వాతి విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా జనార్ధనరావు



పిడుగురాళ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్(అక్షయ) అధ్యక్షుడిగా ఆవుల జనార్ధనరావును నియమించినట్లు లయన్స్ క్లబ్ పల్నాడు జోన్ చైర్మన్ టంగుటూరి సతీష్ తెలిపారు. కార్యదర్శిగా కోడూరి కాశీశంకర్, కోశాధికారిగా శిష్టల పట్టాభిని ఎన్నుకున్నారు. 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సతీష్ తెలిపారు.

జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పాండురంగ శ్రీను



పాండురంగ శ్రీను

పిడుగురాళ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గొంట్లా శ్రీనివాసరావు (పాం డు రంగ శ్రీను) ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీను నియామకంపై పట్టణ ఆర్యవైశ్య విభాగం, టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తనకు పదవి కేటాయించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు పాండు రంగ శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

దాచేపల్లి మండల కన్వీనర్‌గా నారాయణ



నారాయణ అహమ్మద్ షరీఫ్

దాచేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ దాచేపల్లి మండల శాఖ కన్వీనర్‌గా బొమ్మిరెడ్డి నారాయణ ఏకగ్రీవంగా నియామకమయ్యారు. దాచేపల్లి పట్టణ అధ్యక్షుడిగా షేక్ అహమ్మద్ షరీఫ్ నియామకమయ్యారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో గురువారం సాయంత్రం రాజుపాలెం మండల టీడీపీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశం లో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలను కూటమి అందిస్తుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కొత్తగా ఎంపికైన పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలన్నారు. రైతులకు యూరియా సమస్య లేకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రభుత్వం 50వేల టన్నుల యూరియాను దిగుమతి చేసిందన్నారు. రైతుల గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదన్నారు. నేపాల్‌లో తెలుగు వారి కోసం నారా లోకేశ్ నాయక త్వంలో ప్రభుత్వం వెంటనే స్పందించి పని చేస్తుందన్నారు. వారిని సురక్షితంగా తీసుకు రావటంలో లోకేశ్ కీలక పాత్ర పోషించారన్నారు. రాజుపాలెం మండలంలో నూతనంగా ఎన్నికైన పార్టీ కార్యవర్గ సభ్యులకు కన్నా శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూతనంగా ఎన్నికైన పార్టీ అధ్యక్షులు కన్నాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అంచుల నరసింహారావు, పల్లపాటి పెద్దిరాజు, అంకాళ్ళ ప్రభుదాసు, జీ వెంకటరావు, పూజల వెంకట కోటయ్య, మర్రి వెంకట రామిరెడ్డి, నలమోతు వాసు, దరువూరి నాగేశ్వరరావు, డాక్టర్ వడ్డెంపూడి పవన్, రాజుపాలెం మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టుతో నీరు లీకేజీ

● సాగునీటి కోసం తల్లడిల్లుతున్న రైతులు



కారంపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కారంపూడి నుంచి పెదకొదమగుండ్ల మేజర్ ఎన్ఎస్పీ కాలువ మధ్యలో ఉన్న కల్వర్టు పూర్తిగా అధ్వానంగా మారడంతో కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు మధ్యలోనే లీకేజీ అవుతోంది. దీని ప్రభావంతో చివరి భూములకు సరిపడ నీరు చేరక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరాలుగా నిర్వహణ లేకపోవడం, ఇటీవల వర్షాలకు మరింత కూలిపోయిన నిర్మాణం.. పరిస్థితిని విషమంగా మార్చింది. స్థానిక రైతుల ఆరోపణల ప్రకారం కల్వర్టు కాంక్రీట్ పొరలు ఊడిపోవడం, అంచులు కూలిపోవడం వల్ల నీరు కాలువలో కాకుండా బయటకు పోతుంది. దీంతో చివరి భూములకు నీరు చేరక పంటల సాగులో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం రైతుల్లో ఆగ్రహానికి కారణమైంది.

ఎన్ఎస్పీ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

కాలువ సంరక్షణ కోసం గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై చర్యలు చేపట్టలేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. సాగునీటి సరఫరాను పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

ఎన్ఎస్పీ ఏఈ సుధాకర్ వివరణ

వాటర్ లీకేజీ అవుతుంది నిజమే. పై అధికారులకు ప్రతిపాదనలు పంపి కల్వర్టుకు మరమ్మతులు చేపిస్తాం. చివరి భూములకు సాగునీరందేలా చర్యలు తీసుకుంటాం

రైతులకు సమృద్ధిగా యూరియా పంపిణీ



అచ్చంపేట: మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, జువ్వా రామారావు



క్రోసూరు: దొడ్లేరు ఆర్‌ఎస్‌కేలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న వివిధ శాఖల అధికారులు



దాచేపల్లి: భట్రుపాలెంలో రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న ఏవో వెంకటేష్

అచ్చంపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చం పేట, వేల్పూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోను ఎరువులకు ఎలాంటి కొరత లేదని పీఏసీఎస్‌ల అధ్యక్షులు కొప్పురావూరి కోటేశ్వరరావు, జువ్వా రామారావు అన్నారు. గురువారం స్థానిక పీఏసీ ఎస్‌లలో విలేకరులతో మాట్లాడారు. అచ్చంపేట పీఏసీఎస్‌లో ఇప్పటికే ఆరువేల యూరియా కట్టలు, రెండు వేల డీఏపీ కట్టలు, రెండు వేలు కాంప్లెక్స్ ఎరువులు రైతులకు అందజేశామన్నారు. ప్రతిపక్షాలు యూరి యా లేదని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని తెలిపారు. సమావేశంలో అధ్యక్షులతోపాటు పీఏసీఎస్ డైరెక్టర్లు ఎస్‌కే ఖాజావలి, కొరివి నరసింహారావు పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులను కొనుగోలు చేయాలి

బెల్లంకొండ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు అవసరం మేరకే ఎరువులను కొనుగోలు చేయాలని ఏవో అరుణకుమారి పేర్కొ న్నారు. గురువారం బెల్లంకొండలో ఎరువుల దుకాణంలో తనిఖీ చేప ట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు అవసరం ఉన్న వరకే ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం ఎరువుల దుకాణంలో తనిఖీలు చేపట్టి అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రోసూరు మండలంలో 711 మెట్రిక్ టన్నులు..

క్రోసూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలో 711 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్టు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ తెలి యజేశారు. గురువారం మండలంలోని దొడ్లేరు రైతు సేవాకేంద్రంలో రైతులకు యూరియా అందజేశారు. మొత్తం 480 మంది రైతులకు యూరియా పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఉన్నారు.

● దాచేపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వారి అవసరాలకు సరిపడా యూరియా కట్టలను పంపిణీ చేస్తున్నట్టు దాచేపల్లి ఏవో వెంకటేశ్వర్లు వివరించారు. గురువారం మండలంలోని భట్రుపాలెం, కేసానుపల్లి గ్రామాలకు చెందిన రైతులకు 20 టన్నుల యూరియాను పంపిణీ చేశారు. మిగిలిన గ్రామాల్లోని రైతులకు కూడా త్వరలోనే ఎరువు కట్టలను ఆయా గ్రామాల్లోనే అందజేస్తామని వివరించారు.

కబ్జాదారుడి నుంచి రక్షణ కల్పించాలి



కోనూరు పొలంలో పురుగుమందు తాగేందుకు యత్నిస్తున్న ఆదెయ్య కుటుంబసభ్యులు

అచ్చంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పొలం కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న శాఖమూరి శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆత్మహత్య చేసుకుం టామని కోనూరు గ్రామానికి చెందిన మాలపల్లెవాసులు జూపల్లి ఆదెయ్య కుమారులు, కోడళ్ళు గురువారం పురుగుమందు తాగేందుకు ప్రయత్నించారు. వివరాలిలా ఉన్నాయి. కోనూరు గ్రామానికి చెందిన శాఖమూరి శ్రీనివాసరావు తాత గోళ్ళమూడి సూర్యనారాయ ణ వద్ద 40 సంవత్సరాల క్రితం మాలపల్లెకు చెందిన జూపల్లి ఆదెయ్య రెండు ఎకరాలు కొనుగోలు చేశాడని బాధితులు విలేకరులకు తెలిపారు. వారి ఇళ్ళల్లో పని చేసే ఆదెయ్య సూర్యనారాయణపై ఉన్న నమ్మకంతో అగ్రిమెంట్‌పై వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదెయ్య భార్య చిట్టెమ్మ 2000 సంవత్సరంలో మృతి చెందింది. 2007లో ఆదెయ్య మృతి చెందాడు. ఆదెయ్య కుమారుడు శివ 2018లో చనిపోయాడు. వీరి ముగ్గు రి సమాధులు కూడా అగ్రిమెంట్‌పై ఉన్న పొలంలోనే కట్టించుకున్నారు. ఆర్‌ఎస్‌ఆర్‌లో మాత్రం శాఖమూరి శ్రీనివాసరావు తాత గోళ్ళమూడి సూర్యనారాయణ పేరుపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయిస్తానని శాఖమూరి శ్రీనివాసరావు నమ్మబలికి వారి నుంచి అగ్రిమెంట్ తీసుకొని మోసం చేశాడని బాధితులు తెలిపారు. శ్రీనివాసరావు బెదిరిస్తున్నాడని, అతడి నుంచి ప్రాణ హాని కూడా ఉందని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. పూపల్లి ఆదెయ్య కోడళ్ళు సరోజిని, కోటేశ్వరమ్మ, రోజానమ్మలు ఆత్మహత్యకు ప్రయత్నించగా స్థానికుడైన సాంబయ్య వారిని వారించి ఆపివేశాడు. ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని కోరుతున్నారు.

అక్రమ మైనింగ్ చేస్తే క్రిమినల్ కేసులు

● తహసీల్దార్ కే పుల్లారావు

నకరికల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మట్టిని అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కే పుల్లారావు హెచ్చరికలు జారీ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలోనైతే అక్రమ మైనింగ్ జరుగుతుందో ఆ గ్రామ వీఆర్ వోను, ఆ గ్రామ వీఆర్‌ఏలను బాధ్యులుగా చేస్తామని అన్నారు. రెవెన్యూ అధికారులు అప్ర మత్తంగా ఉండి ఎప్పటికప్పుడు తహసీల్దార్ కార్యాలయానికి అక్రమ మైనింగ్ సమాచారం అందజేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. కొందరు రెవెన్యూ అధికారుల నిర్ల క్ష్యం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని హెచ్చరించారు. ఇలాంటి తప్పులు పునరావృతం కాకుం డా చర్యలు తీసుకోవాలని వీఆర్వోలను, కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.

18న జాబ్ మేళా

సత్తెనపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 18వ తేదీన స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు గురువారం విలేకరులకు తెలిపారు. విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు ఫొటోలు తీసుకొని హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 8074393466లో సంప్రదించాలన్నారు.

టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఫిజికల్ డైరెక్టర్

నకరికల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నకరికల్లు వంగా వెంకటరెడ్డి జడ్పీ హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు తెలిపారు. కోనసీమ జిల్లా మండపేటలో ఈనెల 13, 14 తేదీల్లో జరిగే పోటీల్లో బెల్లంకొండ వైశాలి, దేశినేటి కోటేశ్వరరావులు పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరపున పాల్గొనున్న వీరిని ఫిజికల్ డైరెక్టర్ జీ ఝాన్సీరాణి, ఎస్ఎంసీ చైర్మన్ కాసా మల్లికార్జునరావులు, ఉపా ధ్యాయులు అభినందించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన

దాచేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంపై అవగాహన కార్యక్రమాన్ని దాచేపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు కల్పించారు. గురువారం దాచేపల్లి నగర పంచాయతీలోని పాతిమా బీఈడీ కళాశాలలో సీనియర్ ఫ్యాకల్టీ సభ్యుల నుంచి ఐటీ రంగ ప్రాముఖ్యత సమాచారం అందించారు. దాచేపల్లి మోడల్ స్కూల్ ఐటీ అధ్యాపకులు శేఖర్, ప్రిన్సిపాల్ రవికుమార్ విద్యార్థులకు పరిశ్రమ పరిజ్ఞానం, భవిష్యత్తు అవకాశాలపై స్పష్టత కల్పించారు.

పోరాటాల ఫలితంగానే జీఎస్టీ రద్దు

పెదకూరపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ పోరాటాల వల్ల ఇన్సూరెన్స్ ప్రీమియం మీద జీఎస్టీ రద్దు చేశారని సత్తెనపల్లి బ్రాంచ్ ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచాల రమేష్ అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరులో గురువారం ఏజెంట్స్ ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని బ్రాంచ్ సెక్రటరీ ఈదా శ్రీనివాసరెడ్డి గృహంలో నిర్వహించారు. కార్యక్రమంలో కోశాధి కారి ఎన్ శంకరరావు, కే విజయశ్రీ, హైమావతి, డీ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను బహూకరించిన టీడీపీ మండల నేత రమేష్

పెదకూరపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాల యానికి లక్ష రూపాయలు విలువ చేసే కంప్యూటర్లు బహూకరించిన అర్తిమళ్ళ రమేష్ ఆదర్శనీయులని నాయీ బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. మూడు కంప్యూటర్లను గురువా రం తహసీల్దార్ కార్యాలయంలో బహూకరించారు. తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మక్కెన సాగర్ మాట్లాడుతూ టీడీపీ అభివృ ద్ధి కోసం రమేష్ అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేపాల్‌లో తెలుగువారికి అండగా లోకేశ్



ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో ఉన్న తెలుగువారికి అండగా మంత్రి నారా లోకేశ్ వారిని స్వస్థలాలకు సురక్షి తంగా చేరుస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రశంసించారు. గుంటూరులోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ నేపాల్‌లో జరుగుతున్న మారణహోమంలో తెలుగువారు చిక్కుకున్నారని తెలియగానే లోకేశ్ యుద్ధ ప్రాతిపదికన స్పందించారన్నారు. సహాయక చర్యలను వేగవంతం చేశారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటుచేయటం, చిక్కుకుపోయిన ప్రజలకు వసతి సదుపాయలను కల్పించేలా ఏర్పాట్లు చేశారన్నారు. మానవీయ స్పందన, ప్రజలపై ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను లోకేశ్ చాటిచెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో ఆపదలో ఉన్నవారిని సురక్షితంగా రక్షించటానికి చర్యలు చేపట్టారని, 215మంది ప్రజలను సురక్షితంగా తీసుకురావటానికి లోకేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. నేపాల్‌లో తెలుగువారు ఇబ్బం దులు పడుతుంటే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కనీసం స్పందించ లేదన్నారు.

జనసేన సభ్యత్వంతో రూ.5లక్షల బీమా

● ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె



బాధిత కుటుంబానికి జనసేన బీమా చెక్కును అందిస్తున్న అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు

రాజుపాలెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జనసేన క్రియాశీలక సభ్యత్వం ఉన్న ప్రతిఒక్కరికి రూ.5 లక్షల బీమా సౌకర్యం ఉందని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని అనుపాలెంలో క్రియాశీలక సభ్యులు వీర్ల కల్యాణి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కల్యాణి కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును గాదె వెంకటేశ్వరరావు చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, సత్తెనపల్లి నియో జకవర్గ పీఓసీ జిల్లా కమిటీ సభ్యుడు శిరిగిరి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు తోట నరసయ్య, క్రియాశీలక వలంటీర్ తోట హరిబాబు, బత్తుల హనుమంతరావు, అంచుల అనేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



కోర్టు ఆవరణలో న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నిరంతరం న్యాయవాదుల పై జరుగుతున్న దాడులను అరికట్టాలని, న్యాయవాదులను అవమాన కరంగా మాట్లాడుతున్న పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించి న్యాయ దేవత విగ్రహం వద్ద ఆందోళన చేశారు. కృష్ణా జిల్లా నందిగామకు చెందిన కోట దేవదాసుపై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేయటం, ఒంగోలులో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు న్యాయవాదులను కించపరుస్తూ మాట్లాడటాన్ని వ్యతిరేకిస్తున్నామని న్యాయవాదులు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు గంగూరి అజయ్‌కుమార్, చిన్నం మణిబాబు, సయ్యద్ అబ్దుల్ రహీం, దివ్వెల శ్రీనివాసరావు, జూపల్లి శేషయ్య, విజయకుమార్, నరసింహారావు, సంగీతరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగు గ్రామాల్లో విద్యుత్ కోత

పెదకూరపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కం భంపాడు, బలుసుపాడు, పరస, కాశిపాడు గ్రామాల్లో ఈనెల 12వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేశారని ఏఈ దాసరి రామకృ ష్ణ తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ

పెదకూరపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు రణభేరీ పోస్టర్లను ఆవిష్కరించారు. మండలంలోని 75తాళ్ళూరులో గురువారం యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీనుంచి 19వరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ఉద్యమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు కే శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ప్రకాష్, బెల్లంకొండ శివశంకరరావు, కే సుబ్బారావు పాల్గొన్నారు.

సామోటో క్యాస్ట్ సర్టిఫికెట్స్ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

● తహసీల్దార్ కరుణకుమార్

దుర్గి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సొమోటో క్యాస్ట్ సర్టిఫికెట్స్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ కరుణకుమార్ వీఆర్వోలకు సూచించారు. గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 12324 సొమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు ఉన్నాయన్నారు. వీటిలో 3820 మాత్రమే పూర్తయ్యాయన్నారు. సర్వే పూర్తయ్యే వరకు ఎవరికి సెలవులు ఉండవన్నారు. తన అనుమతి లేకుండా సెలవు పెడితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అరాచక, అబద్ధాల పార్టీలను ప్రజలు ఛీ కొడతారు

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి

మాచర్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 15 నెలలుగా ఉన్న అబద్ధాల ప్రభుత్వాన్ని, 2019-2024 మధ్య ఉన్న అరాచక ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు ఛీ కొడతారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి చెప్పేది గొప్పలు, చేసేది కొంచెమని, అన్నీ ఆర్భాటాలేనన్నారు. బహిరంగ సభల పేరుతో ధనం వృధా చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాలు, దుర్మార్గాలు, భూకబ్జాలు మరిచిపోకముందే మరలా రప్పా రప్పా నరుకుళ్ల రంకెలు వేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు 2029లో కాంగ్రెస్ పార్టీకి పట్టంకట్టబోతున్నట్లు సర్వేలు చెబుతున్నాయన్నారు. సమావేశంలో కొమ్ము కోటేశ్వరరావు, దొడ్డా శ్రీనివాసరావు, వంగపాటి నాగరాజు, శేఖర్ పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు సీతారాం ఏచూరి

● సీఐటీయూ జిల్లా నేత ఆంజనేయులునాయక్

మాచర్ల రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గొప్ప దార్శనికుడు సీపీఐ (మార్క్సిస్ట్) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి అని సీఐటీయూ జిల్లా నేత ఆంజనేయులు నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సీతారం ఏచూరి ప్రథమ వర్ధంతిలో ఆయన మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు సైతం అభిమానించే వ్యక్తి సీతారాం అని కొనియాడారు. కార్యక్రమంలో బండ్ల మహేష్, వై సురేష్, వెంకటరత్నం, వేముల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి: విద్యార్థి నాయకుడిగా సీపీఎం జాతీయ నాయకుడిగా, రాజ్యసభ సభ్యుడిగా సీతారాం ఏచూరి ప్రజాసమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని పార్టీ జిల్లా కార్యదర్శి జి.రవిబాబు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



సీతారాం వర్ధంతిలో మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్



పూర్వ వీసీలను సత్కరిస్తున్న వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం, రెక్టార్ రత్న షీలామణి తదితరులు

నైపుణ్యాల పెంపుతో..
పోటీ ప్రపంచంలో రాణించాలి

● ఏఎన్‌యూ 49వ వ్యవస్థాపక దినోత్సవంలో వీసీ ఆచార్య గంగాధరరావు ● ఘనంగా స్వర్ణోత్సవాలు ప్రారంభం

ఏఎన్‌యూ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):సాంకేతిక నైపుణ్యాలతోనే విద్యార్థులకు అభివృద్ధి అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు. ఏఎన్‌యూ 49వ వ్యవస్థాపక దినోత్సవం వర్సిటీలోని డైక్‌మెన్ ఆడిటోరియంలో గురువారం ఘనంగా జ రిగింది. తొలుత ఆచార్య నాగార్జునుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి స్వర్ణోత్సవాలను ప్రారంభించారు. మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు రెక్టార్ రత్న షీలామణి అధ్య క్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలో అధ్యాపక పోస్టుల భర్తీ చేయాలని ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా దేశ ప్రగతికి ప్రయోజనం కలుగుతుందన్నారు. అమరావతి ప్రాంతంలో ఉన్న ప్రైవేటు యూనివర్సిటీలకు దీటుగా ఏఎన్‌యూ ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య రత్న షీలామణి మాట్లాడుతూ ఏడాది కాలం పాటు స్వర్ణోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవాల లోగో ప్రత్యేకతను వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ పూర్వ ఉప కులపతుల దూర దృష్టి విశ్వవిద్యాలయ అభివృద్ధికి దోహద పడిందన్నారు. ఏడాది పాటు నిర్వహించే వేడుకలకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని పూర్వ ఉప కులపతులను కోరారు. అనంతరం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉప కులపతులుగా విశిష్ట సేవలు అందించిన ప్రొఫెసర్ డి.రామకోటయ్య, ప్రొఫెసర్ సీవీ రాఘవులు, ప్రొఫెసర్ ఎల్. వేణుగోపాల్ రెడ్డి, ప్రొఫెసర్ వి. బాల మోహన్‌దాస్, ప్రొఫెసర్ వై.ఆర్.హరగోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎ. రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి, ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్, ప్రొఫెసర్ వి.దివ్య తేజోమూర్తి, ప్రొఫెసర్ రమేష్ రాజు, డాక్టర్ పి.సుధాకర్‌ను కూడా ఘనంగా సత్కరించారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన జానపద, కూచిపూడి నృత్యాలు, విద్యార్థుల గేయాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాళ్లు ఆచార్య వీరయ్య, ఆచార్య సురేష్ కుమార్, ప్రొఫెసర్ లింగరాజు, ప్రొఫెసర్ ప్రమీల రాణి, ప్రొఫెసర్ పాల్ కుమార్, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సుమంత్ కుమార్, ప్రొఫెసర్ జగదీష్‌నాయక్, ఓఎస్డీ ఆచార్య రవికుమార్, సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ వెంకటేశ్వర్లు, రూసా డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్, డీన్ ఆచార్య వి రవికుమార్. సీడీఈ పరీక్షలు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచంద్రన్, యూజీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్‌వీ కృష్ణారావు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూర్వ ఉపకులపతులు

తస్సదియ్యా.. రోశయ్యా



- వయస్సు మీద పడనివ్వని 82 ఏళ్ల వృద్ధ రైతు
- 75 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం.. అందులోనే ఆదాయం
- కుర్రాడిలా కొబ్బరి చెట్లెక్కి.. నెలకు రూ.20 వేల సంపాదన
- మోడల్ సాగుతో లాభాల పంటలు..
- ఆదర్శం.. అత్తోట రైతు జీవన విధానం

ఎనిమిది పదుల వయసు దాటిన వృద్ధుడు కొబ్బరి చెట్టును అవలీలగా ఎక్కి.. కాయలు కోస్తాడు అంటే నమ్మగలమా?!. ఇప్పటికీ సైకిల్‌ను సులువుగా తొక్కేస్తాడు అంటే విశ్వసిస్తామా? పొద్దు పొడవగానే దొడ్లో పశువుల పాలు పితుకుతాడు. అక్కడి నుంచి సైకిల్‌పై వెళ్లి పొలంలో పొద్దు పోయే దాక పనులు చేస్తాడు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమంలో భాగంగా 75 సెంట్ల భూమిలో ఐదు లేయర్ మోడల్ (5 అంతస్థుల నమూనా) ను అమలు చేస్తున్న రైతు నామని రోశయ్య.. వ్యవసాయ క్షేత్రం గురించి తెలుసుకొందాం.



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కొల్లిపర మండలం.. అత్తోట గ్రామానికి చెందిన రైతు రోశయ్య.. కొబ్బరి, నిమ్మ, బొప్పాయి, అరటి, జామ, పసుపు, మామిడి, పూలు మొక్కలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఇలా మొత్తం 52 రకాల పంటలు పండిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను గ్రామంలోనే విక్రయిస్తూ.. నిత్యం ఆదాయం పొందుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రోశయ్యకు ఇద్దరు సంతానం. మొత్తం నాలుగు ఎకరాల సాగు భూమి ఉంది. ఇది నల్ల రకం నేల. ఎక్కువగా వరి సాగుచేస్తారు. చిన్న నాటి నుంచి వ్యవసాయ పనులు చేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో.. పురుగు మందులు, ఎరువులతో పెట్టుబడి పెరిగిపోయింది. దీంతో ఆయన నష్టాలను చవి చూశారు. పిల్లలకు భూమిని పంచిపెట్టి తన భాగానికి వచ్చిన 75 సెంట్లలో ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నారు.

పాలేకర్ శిక్షణతో మార్పు

పద్మశ్రీ అవార్డు గ్రహీత సుభాష్ పాలేకర్‌తో రాష్ట్ర ప్రభుత్వం



తేనె టీగల పెంపకం

ప్రకృతి వ్యవసాయం పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. గ్రామం నుంచి వ్యవసాయంతో మంచి అనుబంధం కలిగిన రోశయ్యని శిక్షణకు పంపించారు. ఆ రోజు నుంచి ఏపీ సీఎన్ఎఫ్ రూపొందించిన విధానాలను ఆయన అమలు చేశారు. 2016లో రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయ కుమార్ రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆర్‌వైఎస్ఎస్ ఆవిష్కరణలో భాగంగా రూపొందించిన 5 లేయర్ మోడల్ విధానాన్ని రోశయ్య 75 సెంట్లలో సాగు చేస్తున్నారు. రెండు ఆవులను పెంచుకున్నారు. ఆవు మూత్రం, పేడను వేరు చేసి ఘన, ద్రవ జీవామృతం తయారు చేసి.. పొలంలో వినియోగిస్తు న్నారు.

నిత్యం ఆదాయం

రోశయ్యకు మొదట్లో పొలం మీద వచ్చే ఆదాయం తగ్గిపోయింది. అదనపు ఆదాయం కోసం 75 సెంట్ల చుట్టూ 40కి పైగా కొబ్బరి మొక్కలు పెంచారు. కొబ్బరి కాయల ద్వారా కొంత ఆదాయం పొందేవారు. 2016లో తర్వాత ప్రకృతి వ్యవ సాయం ఆవిష్కరణ లో భాగంగా రూపొందించిన ఐదు లేయర్స్ మోడల్ విధానం ప్రారంభించారు. ఈ నమూనాలో 50 రకాల మొక్కలను నాటారు. బొప్పాయి, అరటి, మామిడి, పైనాపిల్, అంజీర, అరెంజ్, పనస, నిమ్మ, నేరేడు, డ్రాగన్, రామ, సీతాఫలం, మునగ, యాలకులు, కంద, పసుపు, మునగ, జామ, సపోటా, పండ్లతో పాటు పూల మొక్కలను సాగు చేశారు. అశ్వగంధా ఆయుర్వేద మొక్కలు కూడా పెంచారు. పండిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను గ్రామంలోనే విక్రయిస్తూ నెలకు రూ. 20 వేల దాక ఆదాయం పొందుతున్నారు.

నేటికీ కొబ్బరి చెట్లు ఎక్కి..

ఎనిమిది పదుల రెండేళ్ల వయసులోనూ రోశయ్య శరీరం పట్టుతప్ప లేదు. ఇప్పటికీ కొబ్బరి చెట్టును సునాయాసంగా ఎక్కేస్తారు. రోజుకి మూడు చెట్ల కొబ్బరి కాయలు కోసి వాటిని గ్రామంలో విక్రయిస్తున్నారు. నిమ్మకాయలు, బొప్పాయి తదితర పండ్లనూ.. విక్రయిస్తారు. నేటికి ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. తోటలోని పంట ఉత్పతులను ఇంటిల్లిపాది తీసుకుం టారు. వయసు మీదపడుతున్నా కూడా తన పనులు చేసుకుంటూనే వ్యవసాయం చేయడంతో గ్రామంలో అందరికీ మార్గదర్శిగా నిలుస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అర్థం చేసుకోవాలి

- రైతు నామని రోశయ్య

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి రైతు అర్థం చేసుకోవాలి. అప్పుడే వ్యవసాయంలో మార్పులు వస్తాయి. తక్కువ పెట్టుబడి.. ఆరోగ్యకరమైన ఉత్పత్తులతో ఆదాయం లభిస్తుంది. నేలలో చాలా మార్పులు చోటుచేసుకోవడం గమనించాను. ప్రకృతి వ్యవసాయం వచ్చాక వ్యవసాయ విధానాల్లో చాలా మార్పులు వచ్చాయి. నేల ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్యం మెరుగుపడింది. నా చుట్టు పక్కల ఉన్న రైతులను మార్చాలని ప్రయత్నిస్తున్నా. కొందరు త్వరగా నమ్మరు. అయినా నా ప్రయత్నం మానుకోలేదు. ఇది ప్రపంచానికి అవసరం.



మూడు జిల్లాలకు నూతన కలెక్టర్లు

(5వ పేజీ తరువాయి)

పాటు ఇతర జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మా ట్లాడారు. అన్నింటికీ నిబంధనలు అని పోకుండా మానవీయ కోణంలో పనిచేయాలని చంద్రబాబు సూచించారు. ఫేక్ ప్రచారాలు పెనుసవాల్‌గా మారాయని, వాటిపై రియల్‌టైంలో స్పందించాలని తెలిపారు. సీఎం అంటే కామన్ మ్యాన్ అని తాను చెబుతున్నానని, కలెక్టర్లు కూడా అదే పాటించాలన్నారు. తన ఆలోచనలు, అంచనాలను అందుకుని ఉత్తమ పనితీరు చూపాలన్నారు. ప్రభుత్వ విజయా ల్లో కలెక్టర్లదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. 360 డిగ్రీల్లో మీ పని తీరు పరిశీలించిన తర్వాతనే కలెక్టర్‌గా అవకాశం కల్పించామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం వారితోనే మమేకం కావాలన్నారు. ప్రజలు తమ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత కలెక్టర్లదేనన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు లు తీసుకురావడానికి ఇదొక మంచి అవకాశమని తెలిపారు. కిందిస్థాయి అధికారుల్లో కూడా స్ఫూర్తిని నింపాలని సూచించారు. ఎమ్మెల్యేలకు తగిన గౌర వం ఇచ్చి వారు చెప్పే పనుల్లో మంచి, చెడు చూసి ప్రజలకు ఉపయోగపడేవి చేయాలన్నారు.

ప్రకాశం నుంచి గుంటూరుకు..

గుంటూరు జిల్లా కలెక్టర్‌గా తమీమ్‌అన్సారియా నియమితులయ్యారు. నాగలక్ష్మిని మార్చి ఆ స్థానంలో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఉన్న తమీమ్ అన్సారియాను ప్రభుత్వం నియమించింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన అన్సారియా 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆమె కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ(పబ్లిక్ మేనేజ్‌మెంట్) చేశారు. 26 ఏళ్ల వయస్సులోనే 314వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం 2021లో శ్రీశైలం ప్రాజెక్టు, రాయలసీమ రీజియన్ ఎంఐజీ హౌసింగ్ ప్రాజెక్టులకు స్పెషల్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ లభించింది. ఆ తర్వాత 2022లో శ్రీశైలం ప్రాజెక్టు అధికారి, ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కమ్ స్పెషల్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఏప్రిల్ వరకు అన్నమయ్య జేసీగా విధులు నిర్వహించారు. మ్యాటర్నిటీ, చైల్డ్‌కేర్ సెలవుల అనంతరం 2024లో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పోస్టింగ్ లభించింది. గత ఏడాది ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో అన్సారియా సామర్థ్యాన్ని గుర్తించిన సీఎం చంద్రబాబు ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. అప్పటి నుంచి ఆమె ప్రకాశం కలెక్టర్‌గా కొనసాగారు.

బాపట్ల కలెక్టరు.. డాక్టర్

బాపట్ల జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ వాసుదేవవినోద్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుత కలెక్టర్ వెంకటమురళిని ప్రభుత్వం బదిలీ చేసింది. నూతనంగా జిల్లా పగ్గాలు చేపట్టనున్న వినోద్‌కుమార్ 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. కర్ణాటకలోని హోసపేటె ఈయన స్వస్థలం. వినోద్ స్కూలింగ్ మొత్తం శివమొగ్గ, దావణగెరెలో సాగగా, బెంగళూరు వైద్య కళాశాలలో 2014లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అదే ఏడాది యూపీఎస్సీ పరీక్షల్లో ఐఏఎస్‌గా అర్హత సాధించారు. అనంతపురం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన తర్వాత రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా, పార్వతీపురం ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహించారు. నెల్లూరు జిల్లా జేసీ, ఏపీ ఆరోగ్య పీడీతో పాటు కమిషనర్‌గా, రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్‌గా సేవలందించారు. గతేడాది ఎన్నికలకు ముందు ఈసీ చేపట్టిన బదిలీల్లో డాక్టర్ వినోద్‌కుమార్‌ను అనంతపురం కలెక్టర్‌గా నియమితులు కాగా కూటమి ప్రభుత్వం ఆయనను కొనసాగించింది. తాజా బదిలీల్లో ఆయనను బాపట్ల జిల్లాకు నియమితులయ్యారు. గతేడాది జూలై 5న బాపట్ల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటమురళి 14 నెలలు బాధ్యతలు నిర్వహించారు.

తొలి మహిళా కలెక్టర్‌గా.. శుక్లా

పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో కృతికశుక్లాను నియమించింది. కాగా జిల్లా ఏర్పడిన 2 ఏళ్ల ఐదు నెలల్లో శుక్లా నాలుగో కలెక్టర్‌గా రానున్నారు. 2024 జూలై 2న నియమితులైన అరుణ్‌బాబు గురువారం బదిలీ అయ్యారు. ఇంటర్మీడియల్ విద్యా మండలి కార్యదర్శిగా పనిచేస్తున్న కృతికశుక్లా పల్నాడు జిల్లాలో తొలి మహిళా కలెక్టర్‌గా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. కృతిక జమ్మూకశ్మీర్ కేడర్ 2013 ఐఏఎస్ అధికారి. ఆమె ఏపీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. కాకినాడ జిల్లా కలెక్టర్‌గా, వయోజన విద్య డైరెక్టర్, ఏపీడబ్ల్యూసీఎఫ్‌సీ మేనేజింగ్ డైరెక్టర్, ఉమెన్ డెవలప్‌మెంట్ చైల్డ్ వెల్ఫేర్ డైరెక్టర్, జువైనల్ వెల్ఫేర్ ఎండీ, ఎయిడెడ్ సీనియర్ సిటిజన్ అసిస్టెంట్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, విశాఖ అసిస్టెంట్ కలెక్టర్, మదనపల్లి సబ్‌కలెక్టర్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు జేసీగా ఆమె విధులు నిర్వహించారు. గత ప్రభుత్వం హయాంలో రూపొందించిన దిశకు ప్రత్యేక అధికారిగా ఆమె పనిచేశారు. కృతిక భర్త హిమాన్షుశుక్లా కూడా ఐఏఎస్ అధికారి. ప్రస్తుత బదిలీల్లో ఆయన నెల్లూరు కలెక్టర్‌గా నియమితులయ్యారు.

తురకపాలెం మరణాలపై..
కొనసాగుతున్న అధ్యయనం: కలెక్టర్

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో అసాధారణ మరణాలపై అధ్యయనం కొనసాగుతోందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. తురక పాలెంలో ఇప్పటి వరకు నిర్వహించిన రక్త నమూనా పరీక్షల్లో ఇద్దరికి మాత్రమే మెలియాయిడోసిస్ జ్వరాలకు కారణమయ్యే బర్ఖల్‌దేరియా సూడోమల్లీ బ్యాక్టీరియాను గుర్తించినట్లు వెల్లడించారు. మట్టి నమునా పరీక్షల నివేదిక ఇంకా రావాల్సి ఉందన్నారు. మట్టిలో కూడా ఈ బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉందని ఆమె తెలిపారు. తురకపాలెంలో గత 15 ఏళ్లల్లో ఏటా సగటున 21 నుంచి 22 మరణాలు సంభవించినట్లు ఆమె తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లినప్పుడు చర్మంపై పగుళ్లు ఉన్న వారికి ఈ బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విధంగా కూడా కొంత మందికి మెలియాయోడోసిస్ జ్వరాలు వస్తు న్నాయని భావిస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి వివరించారు. తురకపాలెంలో ఆర్‌ఎంపీ వైద్యుడిపై పలు ఫిర్యాదులు తమకు అందా యని, వీటిపై విచారణ జరిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధ్యులపై చర్యలు : కమిషనర్ వీరపాండియన్

తురకపాలెం ఘటనపై నివేదిక అందిన తర్వాత సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ బాధ్యులపై తప్పనిసరిగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటా మని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు.మంగళగిరి ఏపీఐఐసీ టవర్స్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. 'తురకపాలెంలోని మరణాల నమోదులో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు అలక్ష్యం జరిగింది. జిల్లా నుంచి రాష్ట్ర పర్యవేక్షణ అధికారులకు సమాచారం అందలేదు. శాఖపరమైన విచారణ నివేదిక అందిన వెంట నే బాధ్యులపై చర్యలు ఉంటాయి." అని వీర పాండియన్ స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధుల కారణాలు, సమస్యాత్మక ప్రాంతాల గురించి సి బ్బంది, అధికారులకు తెలుసని.. సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకురావడం లేదు? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్‌లోనే భూమి శిస్తు చెల్లింపు

● రసీదు విధానానికి స్వస్తి ● రైతుల్లో కొరవడిన అవగాహన

పిడుగురాళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గ్రామాల్లో కరణాలు, మునసుబులు వ్యవస్థ ఉండేది. ప్రతి రైతు నుంచి ప్రభుత్వం నిర్ణయించిన భూమిశిస్తును గ్రామ కరణాలు, మునసుబులు వసూలు చేస్తుండేవారు. కొన్నేళ్ల తర్వాత శిస్తు రసీదు కనిపించకుండా పోతే.. ఇప్పటి దాకా వున్న భూమి శిస్తు బకాయి మొత్తం చెల్లించాల్సిందేనంటూ వసూలు చేసే వారు. తెలుగుదేశం పార్టీ 1983లో అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆంధ్రాలో కరణాలు, మునసు బులు తెలంగాణలో పట్వారి వ్యవస్థలను రద్దుచేసి మండల వ్యవస్థను అమలులోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి కూడా 2019 వరకు పాత విధానంలోనే భూమి శిస్తు వసూలు చేసేవారు. మొద ట్లో ఎకరా మెట్టకు రూ.35, మాగాణికి రూ.70 ఆ తరువాత మాగా ణికి రూ.50, మెట్టకు రూ.50.. తర్వాత క్రమంలో ఏ భూమికైనా ఎకరాకు రూ.200 శిస్తును ప్రభుత్వం శించింది.



కంది పంట సాగు

రసీదు కనిపించకుంటే మళ్లీ మొదటికే..

గతంలో రైతు శిస్తులోని కొంత.. లేదా పూర్తిగా చెల్లించినా రసీదు అప్పటి కరణాలు, మునసుబులు, ఆ తర్వాత వీఆర్‌ఓలు ఇస్తుండే వారు. రెండేళ్లకు మళ్లీ శిస్తు చెల్లించాల్సి వచ్చినప్పుడు పాత రసీదులు చూసి మిగిలిన శిస్తు చెల్లించుకుంటూ ఉండేవారు. ఒకవేళ పాత రసీదు కనిపించకుండా పోతే మొత్తం నగదును శిస్తు రూపంలో చెల్లించేదాక రైతులపై ఒత్తిడి తీసుకొచ్చేవారు. ఈ క్రమంలో 2019లో రైతులకు మేలు కలిగించేలా చంద్రబాబు నాయుడు రెండు ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

అంతా ఆన్‌లైన్..

భూమి ఒకరి పేరు నుంచి మరొకరి పేరుకు రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత కొద్ది రోజుల్లోనే ఆటోమేటిక్ మ్యుటేషన్ జరిగే విధంగా నూతన విధానానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు.. శ్రీకారం చుట్టారు. దీనివల్ల రైతులు తమ వివరాలు భూ రికార్డులో నమోదు చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా పోయింది.

పాత విధానంలో శిస్తు చెల్లింపులో కొందరు అధికారులు సొంత రసీదులు రైతులకు అందించడంతో ప్రభుత్వ ఖజానాకు పడే గండి పడేది. దీంతో భూమి శిస్తు విధానాన్ని ఆన్‌లైన్ చేశారు. రైతు ఖాతా నంబరును ఓపెన్ చేస్తే.. భూమి మొత్తం విస్తీర్ణం, శిస్తు చెల్లింపుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు కనిపిస్తుం టాయి. పట్టణాల్లో ఆస్తి పన్ను చెల్లింపు విధానం మాదిరిగా రైతులు సంబంధిత సచివాలయాలు, మీ-సేవ, సెల్ ఫోన్ ద్వారా కూడా భూమిశిస్తు ప్రభుత్వానికి చెల్లించవచ్చు. చెల్లించిన తర్వాత బకాయి వివరాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. దీంతో ఆన్‌లైన్‌లో చెల్లించిన రసీదు పొరపాటున కనిపించకుండా పోయినప్పటికీ రైతుకు ఇబ్బంది లేదు. ఖాతా నంబరు ఓపెన్ చేస్తే ఇంకెంత భూమిశిస్తు చెల్లించాలో ఆన్‌లైన్‌లో పూర్తిగా కనిపించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

రైతుల్లో తగ్గిన అవగాహన

భూమి శిస్తు ఆన్‌లైన్‌లో చెల్లించే విధానంపై రెవెన్యూ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వస్తున్నాయి. ఇంకా కొందరు రైతులు భూమి శిస్తు చెల్లించుకునేందుకు వీఆర్‌ఓలు తమ వద్దకు రాలేదేమిటని.. ఇంకా వసూళ్లు మొదలు పెట్టలేదేమోనన్న సందేహంతో నాలుగైదేళ్లుగా భూమి శిస్తు చెల్లింపులు చేయడం లేదు. రెవెన్యూ అధికారులు రైతులకు కొత్త విధానంపై అవగాహన కల్పిస్తే.. ప్రభుత్వానికి ఆదాయంతో పాటు రైతుకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

22 ఆలయాలకు
పాలక మండళ్ల నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయ శాఖ

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న 22 ఆలయాలకు పాలక మండళ్లను నియమిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు గురువారం ఆ శాఖ జిల్లా అధికారి గ్రంధి మాధవి పేర్కొన్నారు.

ప్రత్తిపాడులోని దండేశ్వరస్వామి దేవస్థానం, వేణుగోపాలస్వామి దేవస్థానం, బాపతు చెన్నారెడ్డి సత్రం, కాకుమానులోని చెన్నకేశవ స్వామి దేవస్థానం, కట్టెంపూడిలో నాగేంద్ర స్వామి పుట్ట, నిడమర్రులో మల్లేశ్వరస్వామి దేవస్థానం, ఆంజనేయస్వామి దేవస్థానం, కురగల్లులో గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం, ములుకుదురులో రామలింగేశ్వర స్వామి దేవస్థానం, కొమ్మూరులో అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం, నూతక్కిలో వరద వేణుగోపాల స్వామి దేవస్థానం, గుంటూరు సౌత్ర సెంటర్‌లోని సీతారామ సేవ మండలి, విశదలలోని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం, తాడేపల్లిలోని విశ్వేశ్వరస్వామి దేవస్థానం, వంగీపురంలోని అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం, బేతపూడిలోని సోమేశ్వర స్వామి దేవస్థానం, చేబ్రోలులో నాగేశ్వర స్వామి, సీతానగర్‌లో సోమేశ్వర స్వామి దేవస్థానం, గుంటూరు రైలుపేటలోని ఇంకొల్లు మురహరి సత్రం, ఎర్రబాలెంలోని విశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొండమూడిలోని జనార్ధన స్వామి దేవస్థానానికి పాలక మండలి నియామకం చేపడుతూ ఉత్తర్వులు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికపై ఉత్కంఠ

- 29తో ముగియనున్న కార్యవర్గం గడువు
- అధ్యక్ష బరిలో నిలుస్తానంటోన్న బాలకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపార వర్గాలకు ప్రతిష్టాత్మకమైన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం ఎన్నికపై ఈ దఫా ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత కార్యవర్గం గడువు ఈ నెల 29తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నిక ఏకగ్రీవమా లేక అనివార్యమా అనే ప్రచారం జోరందుకుంది. చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడిగా మూడు దశాబ్దాలకు పైగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆతుకూరి ఆంజనేయులు ప్రస్తుతం చాంబర్‌కు శాశ్వత గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. కార్యవర్గం గడువు ఏడాది పాటు ఉంటుంది. ఇప్పటి వరకు.. పదవీ కాలం ముగిసేలోపు సర్వసభ్య సమావేశం నిర్వహించి, బరిలో ఎవరూ నిలవకపోతే ఏకగ్రీవం జరిగేది. అయితే గతేడాదిలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష అభ్యర్థిగా రంగా బాలకృష్ణ బరిలో నిలవడంతో ఎన్నికలు అనివార్య మయ్యాయి. ఈ సమయంలో అధ్యక్ష అభ్యర్థిగా మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు ప్యానల్, రంగా బాలకృష్ణ ప్యానల్ ఎన్నికల బరిలో నిలవగా యేల్చూరి ప్యానల్ విజయం సాధించింది. రంగా బాలకృష్ణ ఈ దఫా కూడా అధ్యక్ష పదవికి ఎన్నికల బరిలో నిలుస్తానని చెప్పినట్లు చాంబర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే మరోసారి ఎన్నికలు తప్పవని చెబుతున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

శావల్యాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ రాష్ట్రసంఘం పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శావల్యాపురం జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి కరపత్రాలు చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన నాలుగు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అలాగే మెమో 57 అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమీషన్‌ను ఏర్పాటు చేయాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలని కోరారు. తమకు రావాల్సిన అన్ని పెండింగ్ బకాయిలను చెల్లించాలని, హెల్త్‌కార్డ్ పరిమితి రూ.25లక్షలకు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, స్టాఫ్‌సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, ఏపీటీఎఫ్ మండలాధ్యక్షులు రామకృష్ణ, సెక్రటరీ గురుబాబు, నాయక్ పాల్గొన్నారు.

మద్దిరాల నవోదయ విద్యాలయంలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 సంవత్సరానికిగాను 9, 11వ తరగతులలో మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఎన్ నరసింహారావు గురువారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న జరుగుతుందన్నారు.

పేద బ్రాహ్మణులకు బియ్యం పంపిణీ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ఐదుగురు పేద బ్రాహ్మణులకు ఒక్కొక్కరికీ 25 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. శ్రీసాయి సేవా సదన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్కిరాజు ప్రభాకర్ ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు చుట్టూ దుర్గాంబ, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు మానసికంగా ధృఢంగా ఉండాలి'

నూజెండ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉండాలని పల్నాడు జిల్లా మానసిక ఆరోగ్య వైద్యురాలు పవిత్ర అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జడ్పీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పవిత్ర మాట్లాడుతూ, మానసిక సమస్యలు దరి చేరకుండా ఉండేందుకు జీవన శైలిలో మార్పులు చేసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడి ఉన్న వారు 14416 ఉచిత ఫోన్ నెంబరుకు ఫోన్ చేసి టెలికౌన్సిలింగ్ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, సోషల్ వర్కర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఉపాధ్యాయుడు బీరువా, కుర్చీల వితరణ

ఈపూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ఏపీ మోడల్ స్కూల్‌కు బీరువా, కుర్చీలను పాఠశాల ఉపాధ్యాయుడు వీ శ్రీనివాసరావు బహుమతిగా ఇచ్చారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ పద్మజ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు.

15 నుంచి యోగా శిబిరం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం 189వ ఉచిత యోగా శిక్షణ శిబిరం 15వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని నరసరావుపేట నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్ధనరావు గురువారం తెలిపారు. సమాచారంకోసం కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, 9491665733, 9490846333 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో 2010 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మీట్ యువర్ అలూమినీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్యార్యక్రమానికి బెంగుళూరు వీజె టెక్నాలజీస్ అండ్ సర్వీసెస్ ఎండీ బానావత్ కోటా నాయక్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

● మతుకుమల్లి (శావల్యాపురం) సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): నర్సరావుపేట శ్రీ దత్తా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మండలంలోని మతుకుమల్లిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 14వ తేదీన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● నరసరావుపేట లీగల్: చికిత్స పొందుతూ ఓ ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందారు. గుంటూరుకు చెందిన బండారు వెంకటసాయి (41), నరసరావుపేట డీఎంహెచ్ఓ కార్యాలయంలో పనిచేస్తున్నారు. పట్టణంలోని ఓ గదిలో నివసిస్తూ బాత్రూంలో జారిపడి తలకు తీవ్ర గాయమైంది. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఆయన మరణించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● నరసరావుపేట లీగల్: తన భార్య, కుమార్తె కనిపించడం లేదంటూ పట్టణానికి చెందిన చెందిన సికినం ఫణికుమార్ మొదటి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● వినుకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ లీలావతి పుట్టినరోజు వేడుకలు పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముస్లిం మైనారి టీ అధ్యక్షుడు చికెన్‌బాబు, బిస్కెట్ వలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు అక్బర్‌బాషా, డి.వీరాంజనేయులు, డి. మునయ్య, పువ్వాడ కృష్ణ, ఎం.నరసింహారావు, అచ్యుత కోటేశ్వరరావు,షేక్ మౌలాలి, డబ్బాల సుభాని తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


రొంపిచర్ల మార్కెట్‌యార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు, పక్కన గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

రొంపిచర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. రొంపిచర్లలో మార్కెట్ యార్డులో గొర్రెలు, మేకలు సంతను ఆయన గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మార్కెట్ యార్డులో అమ్మకాలకు సంబంధించిన నివేదికలను రూపొందించాలని కార్య దర్శిని ఆదేశించారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మార్కెట్ యార్డు అభివృద్ధి కి సహకరిస్తానని తెలిపారన్నారు. వైసీపీ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలి వేశారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టపడి పని చేస్తున్నారని తెలియ జేశారు. మార్కెట్ యార్డుకు ఆదాయం పెరుగుతుందన్నారు. కేంద్రీయ విశ్వ విద్యాలయం నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో యూరియా సరిపడా ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ఎమ్మెల్యేతో కలసి ముం దుకు నడుస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే, గోనుగుంట్ల ఇద్దరు కలసి గొర్రెలను పరి శీలించారు. అన్నవరంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించబోయే సిమెంట్ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే అరవిందబాబు శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో యార్డు ఛైర్మన్ మొండితోక రాణి, వైస్ ఛైర్మన్ అచ్చుల సాంబశివరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గాడిపర్తి సురేష్, పులుకూరి జగ్గయ్య, లింగా వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు ఇంటూరి ప్రసాదు, సూరాబత్తుల రామారావు, పల్లెల వెంకట రత్నారెడ్డి, లింగా వెంకటేశ్వర్లు, పల్లెల శివారెడ్డి, డీసీ ఛైర్మన్ యాంపాటి కోటిరెడ్డి, వడ్లమూడి వెంకట కిషోర్, మొండితోక రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహనందిలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ క్షేత్రం మహనంది ఆలయాన్ని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆయన సతీమణి సుధా రాజేశ్వరి గురువారం దర్శించుకున్నారు. మహానందీశ్వరస్వామిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అభిషేకం, రుద్రాభిషేకం చేశారు. అదే విధంగా కామేశ్వరీ దేవి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ, మహానంది దేవాలయం ప్రజలకు ఆధ్యాత్మిక శక్తిని ప్రసాదించే పవిత్ర క్షేత్రమని అన్నారు. కుటుంబ సమేతంగా దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో ఉండని వారిపై చర్యలు తీసుకోండి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


టిడ్కో గృహాలపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలు పొందిన వారు వాటిని వినియోగించుకోకుండా నిరుపయోగంగా ఉంచడాన్ని ప్రభుత్వం ఉపేక్షించదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం తెలిపారు. లబ్ధిదారులు టిడ్కో గృహాల్లో నివాసం ఉండని పక్షంలో, వారి కేటాయింపును రద్దుచేసి, కొత్త వారికి ఇస్తామని ఆయన స్పష్టంచేశారు. టిడ్కో గృహాలపై ఆయన సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. మొదటి దశలో నిర్మించిన 4,512 గృహాలకు గాను 1,529 గృహాలలోనే లబ్ధిదారులు నివాసముంటున్నారని, 2,504 మంది తాళాలు తీసుకొని ఇళ్లను నిరుపయోగంగా ఉంచారని అధికారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటికి తెలిపారు. ఇళ్లు పొందిన వారు రుణ వాయిదాలు చెల్లించడం లేదని, దానివల్ల కొత్త వారికి బ్యాంకులు రుణాలను నిరాకరిస్తున్నాయని అధికారులు చెప్పారు. తొలిదశలో ఇళ్లు పొందిన వారిలో 570 మందికి బ్యాంకులు నేటికీ రుణాలు ఇవ్వలేదని తెలిపారు. తక్షణమే మెప్మా సిబ్బంది ద్వారా ఇళ్ల లబ్ధిదారులు తమ వాటా సొమ్మును చెల్లించేలా చూడాలని, రుణాలు పొందాల్సిన వారికి మేలు జరిగేలా త్వరలోనే బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రత్తిపాటి సూచించారు. నెలనెలా బ్యాంకు రుణాలు చెల్లించకపోయినా, ఇళ్లలో నివాసం ఉండకపోయినా, విద్యుత్ బిల్లులు చెల్లించకపోయినా ఇళ్లు పొందినవారి రిజిస్ట్రేషన్లు రద్దు చేసి, అర్హులైన కొత్తవారికి కేటాయించాలని ప్రత్తిపాటి అధికారులకు సూచించారు. ఈ సమాచారాన్ని లబ్ధిదారులకు చేరవేయాలని అన్నారు. టిడ్కో గృహ సముదాయంలో దుకాణ సముదాయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాల, సచివాలయం, రేషన్ దుకాణం నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ప్రత్తిపాటి అధికారులను ఆదేశించారు. టిడ్కో నివాస సముదాయం సమీపంలోనే శ్మశానవాటిక ఉండేలా చూడాలన్న అధికారుల విజ్ఞప్తిపై ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యపై మంత్రి నారాయణతో మాట్లాడతానని, ఈ లోపు శ్మశానవాటికకు అనువైన స్థలాన్ని అధికారులు ఎంపిక చేయాలని ప్రత్తిపాటి సూచించారు. కాగా, రెండో దశ 1,008 టిడ్కో ఇళ్ల నిర్మాణం నవంబరుకు పూర్తిచేసి సంక్రాంతికి గృహప్రవేశాలు జరిగేలా చూడాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరిముల్లా, మెప్మా ఎంఎంఎం ఆరిఫా సుల్తానా, కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, టిడ్కో అధికారులు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల నిఘా నీడలో కోటప్పకొండ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● డ్రోన్‌తో పరిసరాల పరిశీలన


డ్రోన్ కెమేరాతో కోటప్పకొండ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న పోలీసులు

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ పరిసర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా జరుగుతున్న దారి దోపిడీ, రౌడిమూకల దాడులపై గురువారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనానికి పల్నాడు జిల్లా పోలీసులు స్పందించారు. డ్రోన్ కెమెరాతో కోటప్పకొండ పరిసర ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రత్యేక దృష్టి సారించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నరసరావుపేట రూరల్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా పేకాట, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై నిఘా ఉంచారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను డ్రోన్ కెమెరాలు ఉపయోగించి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నేరాలు జరగకుండా తగిన చర్యలు చేపడతామని అన్నారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిశితమైన ప్రదేశాలను ముందుగా గుర్తించి, పాడుబడిన బంగ్లాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులు గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 112 లేదా ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కి ఫోన్ చేసి తెలపాలని ఎస్పీ సూచించారు. నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యలమందల గ్రామంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జేవి సంతోష్, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధి రెడ్డి సిబ్బందితో పర్యటించి గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కోటప్పకొండ చుట్టుపక్కల ఇటీవల జరిగిన దారి దోపిడీలు, కోడి పందేలు, పేకాట శిబిరాల గురించి ప్రజల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.


సమావేశంలో పాల్గొన్న న్యాయాధికారులు, పోలీసులు, న్యాయవాదులు

జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్‌పై గురువారం స్థానిక కోర్టు ఆవరణలో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయధికారులు ఎస్.సత్యశ్రీ, ఏ సలోమి, సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు, న్యాయవాద సంఘ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగులకు పదోన్నతులపై కృతజ్ఞతలు

● అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫణి పేర్రాజు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకారశాఖ ఉద్యోగులు 230 మందికి పదోన్నతులు కల్పించిన రాష్ట్ర సహకారశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు, సహకారశాఖ కమిషనర్ అహ్మద్ బాబుకు ఏపీ సహకార ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫణి పేర్రాజు కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం నరసరావుపేటలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మీటింగ్ హాల్‌లో ఏపీ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ పల్నాడు జిల్లా ముఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫణి పేర్రాజు మాట్లాడుతూ, పది సంవత్సరాల నుంచి ఉద్యోగులు పదోన్నతుల కోసం వేచి చేస్తున్నారని అన్నారు. వారికి ప్రమోషన్లు కల్పించిన ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పల్నాడు జిల్లా నూతన అధ్యక్షుడిగా పీ వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా డీ రవికుమార్, ఉపాధ్యక్షుడిగా కే అంజమ్మ, కోశాధికారిగా వీ అశోక్‌కుమార్, ఇసీ మెంటర్ ఎం రమేశ్‌ను కో- ఆప్షన్ పద్ధతిలో ఎంపిక చేసుకొని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జీ సురేష్ నాయుడు, రిటైర్డు అసిస్టెంట్ రిజిస్టర్ జేవీడీ తాండల్ కాండం, జిల్లా సహకార అధికారి ఎం నాగరాజు, స్వర్ణ చినరామిరెడ్డి, ఆర్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కోసం 'రైజింగ్ స్టార్'

● జీసీడీవో రేవతి

ఈపూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రాయడం, చదవడంలో నైపుణ్యం సాధించేందుకు రైజింగ్ స్టార్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జీసీడీవో రేవతి తెలిపారు. ఈపూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఏపీ మోడల్ స్కూల్‌ను గురువారం ఆకస్మికంగా జీసీడీవో రేవతి తనిఖీ చేశారు. విద్యార్థులను పాఠ్యాంశాల వారీగా ప్రశ్నించారు. ఎక్కువమంది విద్యార్థులు హిందీలో వెనుకబడి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు హాజరును పరిశీలించారు. భోజనం రుచిచూశారు. భోజనం అనంతరం ఆమె మాట్లాడుతూ, జిల్లాలో 24 కేజీబీవీ పాఠశాలలు ఉండగా అందులో 928 మంది విద్యార్థులు ఉన్నారని, వారి కోసం విజయ పథం కార్యక్రమం ద్వారా ప్రతి రోజు స్లిప్ టెస్టులను పెట్టి వారి నైపుణ్యాన్ని గుర్తిస్తున్నామని చెప్పారు.విద్యాశక్తి కార్యక్రమం ద్వారా ఐజీటీ మద్రాసు నుంచి నిపుణులు ఆంగ్లం,లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులను ఆన్‌లైన్‌లో చెబుతున్నారన్నారని చెప్పారు. రేవతి వెంట కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న మానవ సేవా సమితి నాయకులు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టణంలో గుంటి ఆంజనేయ స్వామి గుడి పక్కన ఉన్న నాగేంద్ర స్వామి గుడి వద్ద గుర్తుతెలియని మృతదేహానికి గురువారం మానవ సేవాసమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మానవ సేవా సమితి అధ్యక్షుడు పీవీ సురేష్‌బాబు, సేవా సమితి ప్రధాన కార్యదర్శి చామర్తి భవాని శంకర్, సమితి సభ్యులు జెడ్డా వెంకట్రావు, నరగాయపాలెం అంజి, నంబూరి నాగార్జున పాల్గొన్నారు.

త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న కలెక్టర్, ఎస్పీ


త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం దర్శించుకున్నారు. ఆలయంలో స్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు.

ఉత్తమ బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దాలి: ఎంఈవో

శావల్యాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధనఅందించి వారిని అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని ఎంఈఓ మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. శావల్యాపురం కొత్త ఎస్టీ కాలనీలోని ట్రైబల్ హెల్పేర్ ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి, రాయించి వారి సామర్థ్యాలు తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల రికార్డులు, బోధనా ప్రణాళికలు, పాఠశాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, విద్యార్థులకు టీఎల్‌ఎం విధానాన్ని అనుసరించి సులుభమైన రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చెంచులక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూరియా నిల్వలపై ఆందోళన వద్దు: ఏడీఏ

కొండకావూరు (నరసరావుపేట రూరల్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని నరసరావుపేట సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) కేవీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం కొండ కావూరు, పమిడిమర్రు గ్రామాల్లో ఏడీఏ శ్రీనివాసరావు యూరియాపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి కే బ్రహ్మయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు వరలక్ష్మి, కృష్ణ, గ్రామ నాయకులు వసంత ఎల్లమంద, మేకల సైదారావు తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ: పట్టణ పరిధిలోని పీఏసీ ఎస్, మన గ్రోమోర్ వినుకొండ, ఎరువుల షాపులను మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. యూరియా గురించి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఆరిఫ్ పాల్గొన్నారు.


దీపక్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

దీపక్ కుటుంబసభ్యులకు మంత్రి గొట్టిపాటి పరామర్శ

చిలకలూరిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నోయిడాలోని బిట్స్ పిలాని హాస్టల్‌లో తుపాకీ కాల్పులకు బలైన పట్టణంలోని గాంధీపేటకు చెందిన దీపక్ కుటుంబసభ్యులను మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ గురువారం పరామర్శించారు. దీపక్ మృతికి వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దీపక్ భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మునిసిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డు ఛైర్మన్ షేక్ కరిముల్లా, సీఆర్ క్లబ్ పాలకవర్గం చెరుకూరి కాంతయ్య, పావులూరి శ్రీనివాసరావు, మక్కెన నరసింహారావు, పలువురు పట్టణ ప్రముఖులు, కౌన్సిలర్లు, నివాళులర్పించిన వారిలో ఉన్నారు. గురువారం దీపక్ అంత్యక్రియలు జరిగాయి.

హోంగార్డు కుటుంబానికి సహచరుల అండ


మరణించిన హోంగార్డు భార్య ఉమాదేవికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మరణించిన హోంగార్డు కుటుంబానికి తోటి హోంగార్డులు అండగా నిలిచి ఆర్థికసాయం అందించారు. వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకట సుధాకర్ ఈ ఏడాది మే 22వ తేదీన అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబానికి తోటి హోంగార్డులు వారి ఒక రోజు వేతనాన్ని వసూలు చేసి మొత్తం రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సాయాన్ని వెంకట సుధాకర్ భార్య ఉమాదేవికి పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీ రెడ్డి హోంగార్డ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. తోటి హోంగార్డు కుటుంబాన్ని ఆదుకున్న హోంగార్డులను ఈ సందర్భంగా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న దూరవిద్య రాష్ట్ర కో-ఆర్డినేటర్ రవీంద్ర నాథ్, పక్కన జిల్లా కో-ఆర్డినేటర్ హుస్సేన్

దూరవిద్యపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

● దూరవిద్య రాష్ట్ర కో-ఆర్డినేటర్ రవీంద్రనాథ్

రొంపిచర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దూరవిద్యపై ప్రజల్లో అవగాహన కల్పించా లని దూరవిద్య రాష్ట్ర కో-ఆర్డినేటర్ రవీంద్రనాథ్ గురువారం తెలిపారు. స్థానిక మండల వనరుల కేంద్ర భవనంలో జిల్లా కో-ఆర్డినేటర్ కేఎంబీ హుస్సేన్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దూరవిద్య విధాన ఆవశ్యకతను వివరించారు. చదువును మధ్యలో ఆపివేసిన వారు దూరవిద్య ద్వారా చదువుకోచ్చని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో ఈ సర్టిఫికెట్లకు ప్రాముఖ్యం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్లోర్‌బాల్ పోటీలలో కే-రిడ్జి విద్యార్థుల ప్రతిభ


ప్రతిభచాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలలో కే-రిడ్జి అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ నెల 4 నుంచి 7వ తేదీలలో బిహార్‌లోని ముజాఫరాపూర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున అండర్ 14 బాలికల విభాగంలో తృతీయస్థానం సాధించారని చెప్పారు. అండర్-14 ఫ్లోర్ బాల్ జాతీయ జట్టుకు ఎంపికైన తమ పాఠశాల విద్యార్థిని సోమేపల్లి లీలా లోహిత త్వరలో సింగపూర్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. ప్రతిభ చాటిని విద్యార్థులను డైరెక్టర్ కే నాసరయ్య, స్కూల్ ఇన్‌చార్జి కోట బాపూజీ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం కిషోర్‌బాబు, పీ మహిత, శేషగిరి అభినందించారు.

ఆట్యాపాట్యాలో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


ప్రతిభచాటిన విద్యార్థులను అభినందిస్తున్న సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆట్యాపాట్యా పోటీలలో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. జిల్లా ఆట్యాపాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలో బాలికల విభాగంలో బోరుగడ్డ సౌజన్య, షేక్ నజ్మా, పుసుపేలేటి తిరుపతమ్మ, కొత్తా లక్ష్మీసరిత, పిన్నెబోయిన స్రవంతి, బాలుర విభాగంలో కాసా శ్రీనివాసరావు, కే త్రినాధ్‌లు ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 25, 26వ తేదీలలో జరిగే స్టేట్ మీట్‌లో వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్‌లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పీవీ అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయులు అభినందించారు.

యూరియా కొరతపై వైసీపీ ఆందోళన హాస్యాస్పదం

● గుర్రపునాయుడుపాలెం సొసైటీ చైర్‌పర్సన్ సుబ్బారావు

నూజెండ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరత ఉందంటూ వైసీపీ నాయకులు చేస్తున్న ఆందోళన హాస్యాస్పదంగా ఉందని గుర్రపునాయుడుపాలెం సొసైటీ చైర్‌పర్సన్ ముండ్రు సుబ్బారావు అన్నారు. గురువారం సొసైటీ కార్యాలయంలో యూరియా నిల్వలు, సరఫరాపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అవ్వటాన్ని వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. కార్యక్రమంలో ఐనవోలు డీసీ ఛైర్మన్ రావుల బుజ్జి, టీడీపీ నాయకుడు కె.నరేష్ తదితరులు పాల్గొన్నారు.